# గురువుల బాధలు ఎవరికి ఎఱుక!

ఒకసారి ఆచార్య భరద్వాజ గారు, జీవిత పర్యంతము కీకారణ్యములలో నివసించిన తపస్వి, సిద్ధపురుషుడు అయిన శ్రీ పాకలపాటి గురువుగారిని దర్శించారు. ఆయన అనారోగ్యంగా వుండటం చూచి, మాటల సందర్భంలో, "బాబుగారూ, మీరింత బలహీనంగా ఉన్నారుగదా, భక్తులనెవరనన్నా భక్తులెవర్నన్నా వచ్చి దగ్గరవుండి సేవచేయనీయరాదా? అది వారికీ మహాభాగ్యమే గదా!" అన్నారు.

దానికి బాబుగారన్నారు, "ఏమి భక్తులో ఏమిటో!" ఎంతసేపూ 'ఈ కష్టాలు తీర్చు, యీ కోర్కెలు తీర్చు!' అంటూ చుట్టుకునేవారే. ఎన్ని నెరవేర్చినా, తీర్చినా ఏ ఒక్కటో నెరవేరని రోజున అలుగుతారు. అనుకొన్నది నెరవేరిన రోజు సేవచేస్తామంటూ వస్తారు. వద్దంటే వినరు, వదలరు. అలా అని చేయనిస్తే, చేసేవారి మీద చేయలేనివారు అసూయపడి ప్రతి చిన్న కారణానికీ ద్వేషాలూ, పంతాలు అసూయలు పెంచుకుంటారు. ముఠాలు కడతారు. అటు రాకున్నా బాగానే వుంటుంది; సక్రమంగా వచ్చినా బాగుంటుంది. సేవ చేసేవారు గూడా త్వరలో తమకేదో నాపై హక్కున్నట్లు అడ్డమైన వాళ్ళనూ తెచ్చి నానెత్తికెక్కిస్తారు. సిఫారసులు చేస్తారు. అడ్డమైన చోట్లకూ రమ్మంటారు. వెళ్ళకుంటే తమ మాట పోయిందనేడుస్తారు. అదంతా భక్తేనని వారి భావం.

మొదట అందరూ నేను చెప్పేది విని నేనివ్వదలచిన శ్రేయస్సును పొందాలనే వస్తారు. అలా అని చేరదీస్తే చివరికి వారు చెప్పినట్టల్లా ఆడమంటారు. ఆడకపోతే నామీదే గుసగుసలు ప్రారంభిస్తారు. బాబుగారు మారిపోయారంటారు. అసంతృప్తితో దౌర్భాగ్యపు జీవితాలవైపు మొగ్గుతారు. అట్టి బెదిరింపులతో నన్నాడించాలని చూస్తారు. సేవచేస్తామంటారు. అంగీకరిస్తే తామెంతో అధికులైనట్లు అహంకరిస్తారు. క్రమంగా నాపట్ల తేలిక భావాన్ని వహిస్తారు – నేనేదో వాళ్ళపై ఆధారపడి, వారిని స్వప్రయోజనానికి వాడుకుంటున్నట్లు, అలాకాదని తెలిసేలా చేస్తే యింత సేవా చేయించుకొని వారిని అవసరం తీరగానే విదిలించినట్లు బాధపడతారు. మన ప్రతిచర్యను, మాటనూ వాళ్ళ యిష్టాయిష్టాల త్రాసుల్లోతూచి మన మీద తీర్పులు చేస్తారు. వారి అంతర్యంలో యిట్టి మార్పులు రావడం గుర్తించి దూరంగా ఉంచితే వారి మంచితనాన్ని మనమపార్థం చేసుకుంటున్నామని వాపోతారు. గుర్తించినట్లుంటే లోపల కినుక, చులకనభావమూ పెంచుకుంటారు. ఈ మనుషులతో మనడం కష్టమే! అందుకే నాకు వారి మధ్య జీవించడంకంటే ఈ అరణ్యంలోనే బాగుంటుంది. వారి సేవ కంటే యీ అనారోగ్యమే మేలనిపిస్తుంది. విశ్వాసంతో ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉంటుంది!".

---

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

SRI MANGA BHARDWAJA TRUST

ఛీఫ్ ఎడిటర్: **శ్రీ పోలూరి శ్రీనివాసరావు** బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: **డా॥ ఆర్.ఎస్. శశిధర్,** పిహెచ్. డి

**సంపుటి: 28** **జూన్ 2010** **సంచిక: 2**

సర్వప్రాణులకూ ప్రాణం-జీవితం-చాలా తీపైనది. ఇదే రుజువు జీవితం జీవించ దగినదనటానికి. అలా అనిపించక పోవటానిక్కారణం ఎలా జీవించాలో తెలియక పోవటమే. మొదట ఎలాగో జీవించాలని ప్రాణులన్నీ యత్నిస్తాయి. అటు తర్వాత సుఖంగా, తృప్తిగా జీవించ యత్నిస్తాయి. సుఖం, తృప్తి అన్ని ప్రాణులూ పొందుతాయి- మనిషి తప్ప. కారణం వాటికి భౌతికావసరాలు చాలు. మనిషికి మనసున్నది. అంటే యోచనలు, తెలివి వున్నాయి. కనుక కోరికలున్నాయి. తృప్తి అవి నెరవేరుతే వస్తుందని పాకులాడుతాడు. అలా రాదని సర్వమానవాళి అనుభవాన్ని చూస్తే తెలుస్తుంది. ఇన్ని కోరికలకు, అసంతృప్తికీ మనస్సు కారణం కావడం వల్ల దాన్నెలా సంస్కరించుకొంటే తృప్తి లభిస్తుందో, జీవిత మానందమయమవుతుందో బుద్ధుడు కనుగొన్నాడు. దానినే అందరు మహనీయులు కనుగొన్నారు.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక

1. గురువుల బాధలు ఎవరికి ఎఱుక! 01
2. చరిత్రకెక్కని ఘట్టాలు 03
3. 'కిం వచనీయం గురు మహిమ!" 06
4. అమ్మ – మాస్టర్ గారు 08
5. శ్రీ సాయి సచ్చరిత్ర 14
6. శ్రీ దత్తలీలామృతం –సీరియల్ 18
7. వార్తాలాపము – సీరియల్ 22
8. సాయిబాబాతో ఇంటర్వ్యూ 26
9. శ్రీ భరద్వాజ లేఖామృతము 27
10. మధ్యవర్తులా? మార్గదర్శులా? 29
11. నేటి కళా 'శాలలు' విద్యను నిరాకరించే సంస్థలే! 31

**చందా వివరములు**

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10–00 |
| సంవత్సర చందా | : రూ. 100–00 |
| జీవిత చందా | : రూ. 1,116–00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)
(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | |
|---|---|
| రాజపోషకులు | : రూ. 3,000–00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000–00 |

**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P,Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org

# చరిత్రకెక్కని ఘట్టాలు

- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఆది 1896వ సంవత్సరం ఆగష్టు 13వ తేది. శ్రీసాయిబాబా తీవ్రమైన ఉబ్బసానికి గురియ్యారు. ఒకరోజు తెల్లవారుఝామున బాబావద్ద మహల్సాపతి, అబ్దుల్లా అను భక్తులు మాత్రమే వున్నారు. అప్పుడు సాయి మహల్సాపతితో అన్నారు - "భగత్ (భాగవతుడా)! ఇంత మంది నా దర్శనానికి వచ్చి పూజలు, సత్సంగాలు చేస్తున్నారుగాని వీరిలో ఒక్కరూ నేను వారికి ప్రసాదించాలని ఆరాటపడే జ్ఞానాన్ని అడిగేవాడు, తీసుకొనేవాడు కన్పించడంలేదు. ప్రతివారు 'ఈ కష్టాన్ని తీర్చు, ఆ కోరికతీర్చు' అంటూ నిరంతరం వారి స్వార్థంతో పీడిస్తున్నారు. నాకు విసుగు పుడుతోంది. నేను అల్లా వద్దకు వెళ్ళివస్తాను. మూడు రోజులలో నేనీ దేహంలోకి తిరిగిరాకుంటే నా యీ శరీరాన్ని అక్కడ ఆరుబయట ఖాళీ స్థలంలో సమాధిచేసి రెండు ప్రక్కలా రెండు జండాలు నాటు!" అన్నారు. ఆందోళన చెందిన మహల్సాపతి వారించేలోగానే సాయి అతడి వడిలో వాలిపోయి శరీరాన్ని త్యజించారు. ఆ వార్త తెలియగానే భక్తులు గ్రామస్తులూ మసీదువద్ద గుమిగూడారు. భక్తులైనవారు మహల్సాపతి మాటలను విశ్వసించి మూడు రోజులూ వేచి చూచిగాని సమాధి చేయగూడదని నిర్ణయించారు. కాని భక్తిలేని పామరులు మాత్రం ఊరిలో శవాన్ని మూడురోజులుంచడానికి వీలులేదని గ్రామ మునసబు, పోలీసు పటేళ్ళను వత్తిడి చేయనారంభించారు. గంటలు గడిచి భక్తులు శిరిడీ చేరినకొద్దీ చర్చ తీవ్రతరమవుతున్నది. ఏ నిర్ణయానికీ రాకుండానే కాలం దొర్లిపోతూన్నది. అంత్యక్రియలు చేయవలసే వస్తే యేరీతిన చేయాలన్న వాగ్వాదం గూడ మరొకవంక యిరుమతస్థులమధ్యా రగుల్కొంటూన్నది. ఏ కారణంగానైనా వివిధ వర్గాలవారిమధ్య వాగ్వాదాలు పెరిగిపోయి ఏ క్షణాన్నైనా కొట్లాటలు జరిగే సూచనలు కన్పించసాగాయి. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రతిపక్షంవారు సహించేలా లేరు. ఊరకుంటే ఊరిపెద్దలుగా పరిస్థితిని విషమించనిచ్చినందుకు ప్రభుత్వాధికారులు తమను తప్పబడతారని మునసబు, పోలీసు పటేలును అహ్మద్‌నగర్‌లోని జిల్లా కలెక్టర్ అయిన ఒక పాశ్చాత్యున్ని దగ్గరకు పంపి ప్రభుత్వమీసమస్యలో కల్పించుకొని, కర్తవ్యాన్ని నిర్ణయించి, అమలు జరిపించి ఘర్షణలు జరుగకుండా సహకరించమని కబురు చేశాడు. తాము విదేశీయులుగనుక తాము కల్పించుకుంటే ప్రజలింకా రెచ్చిపోతారనీ, తమదాకా రానివ్వకుండా స్థానిక పెద్దలే సమస్యను పరిష్కరించాలని చెప్పి కలెక్టర్ యిలా అన్నాడట: "సాయి మూడవ రోజున పునరుజ్జీవితులైతే మాత్రం నాకు తెల్పు, వారిని నేనూ దర్శిస్తాను. నాకు తెలిసినంతవరకూ మా మతగ్రంథమైన బైబిల్‌లో ఏసు ప్రభువు తప్ప మరెవ్వరూ మరణించాక పునరుత్థానమైనవారు లేరు!".

పోలీసు పాటిల్ తెచ్చిన వార్త విని మునసబు ఆలోచించి, ప్రభుత్వమువారు మూడు రోజులు వేచి చూచాకగాని అంత్యక్రియలను జరిపించరాదని ఆజ్ఞాపించారని, అలాగాక త్వరపడి

అలాచేసినట్లయితే మూర్ఛవంటి అపస్మారకస్థితిలో వున్న వ్యక్తిని ప్రభుత్వాదేశానికి విరుద్ధంగా ఖననం చేసినట్లు తలచి దండిస్తారనీ పుకారుపుట్టించి మూడు రోజులు గడిపించారు. మహల్సాపతి మాత్రం శ్రీ సాయినాథుని తలను వడిలోనుంచుకొని మూడు రోజులూ నిద్రాది దైహిక క్రియలననచుకొని అలానే ద్వారకామాయిలో కూర్చుండిపోయాడు. ఒక సమయంలో పామరులైన స్థానికులు సాయిదేహాన్ని సమాధి చేయడానికి పట్టుదలతో సిద్ధమవుతూన్న సమయంలో తననుగూడా ఆ దివ్యదేహంతో గూడ సమాధిచేస్తేగాని అలా జరుగనివ్వనని యీ భక్తాగ్రేసరుడు పట్టుబట్టాడు. అంతటితో ఆ భయంకరమైన నిర్ణయం కార్యరూపం ధరించక వాగ్వాదంగా మారింది. తర్వాత 32 సంవత్సరాల వరకూ మానవాళికి ఆ సద్గురుమూర్తి యొక్క దర్శన, భాషణ సేవాదులు లభించడానికి తన ప్రాణాన్నైనా పణంగా పెట్టి నిమిత్తమాత్రుడైన పరమ భాగ్యశాలి మహల్సాపతి. చివరకు ఆగష్టు 15వ తేది అర్థరాత్రి గడచిపోయింది.

మహల్సాపతి తన ప్రాణాలన్నింటినీ తన కళ్ళలో కేంద్రీకరించి, దృష్టిని శ్రీ సాయి ముఖారవిందం మీద నిలిపి తన శ్వాసతో నిమిషాలను లెక్కిస్తూండిపోయాడు. శ్యామా, అబ్దుల్లా ప్రక్కనే గాఢనిద్రలో మునిగియున్నారు. ఉన్నట్లుండి ఒక్క జలదరింపుతో సాయిదేహంలోంచి దీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది. మరొక్క నిమిషమాగి నెమ్మదిగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు ప్రారంభమయ్యాయి. సంతోషంతో మహల్సాపతి శ్యామాను, అబ్దుల్లానూ ఒక్క కేకలో నిద్రలేపాడు. అబ్దుల్లా ఆనందం పట్టలేక కన్నీరు కారుస్తూ, నోట మాటరాక చూస్తున్నాడు. అప్పడు సమయం (ఆగష్టు 16) సుమారు 5 గంటలు. శ్యామా ధుని అగ్నిని ప్రజ్వరిల్లజేసి ఏ మాత్రం చలించకుండా ప్రక్కనే నిలబడ్డాడు. కొద్దినిమిషాలలో సాయి దేహంలోనూ, ముఖంలోనూ జీవకళ తిరిగి తొణికిసలాడింది. మరుక్షణం ఒళ్ళువిరుచుకొని సాయి లేచికూర్చున్నారు. సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతున్న మహల్సాపతికేసి, దూరాన కూర్చున్న అబ్దుల్లాకేసి చూస్తూ సాయి చిన్నగా నవ్వి, శ్యామా వైపు దృష్టి మరల్చారు. శ్యామా తన సహజమైన చొరవతో, పెంకితో అడిగాడు- "సాయి, నువ్వుపోతే పోయావు, ఎక్కడకు పోయావో, ఏమిచేసావో చెప్పు!"

సాయి గంభీరంగా, సాలోచనగా అన్నారు - "నేను మొదట అల్లావద్దకు వెళ్ళాను. నేను మిమ్మల్ని విడచి అప్పడే తమ చెంతకు రాకూడదనీ, యిక్కడే వుండి నా కర్తవ్యాన్ని నిర్వహించాలనీ అన్నారు. అయితే నన్ను రప్పించిన కారణమేమని అడిగాను. బెంగాల్ రాష్ట్రంలోని ఒక పట్టణంలో గదాధర్ అనే సత్పురుషుడున్నాడు. అతడు తన పూర్వపుణ్యాన్ని ఒక్కింతగూడ అనుభవించక నిరంతర భగవచ్చింతనలోనే గడిపాడు. అతడు మరణించే సమయమాసన్నమైంది. అతడు అల్లాలో లయించాలని ఆరాటపడుతున్నాడు. కానీ అతడి పుణ్యం అందుకడ్డొస్తున్నదట. దానిని స్వీకరించి అతడు తనలో కలసే అవకాశాన్ని కల్పించమని అల్లా నన్నాదేశించారు. నేనిందాకనే అక్కడకు వెళ్ళి అతడి ఆత్మను పూర్వపుణ్యంనుంచి విడుదలచేసి వస్తున్నాను." అన్నారు. ఆ మాట వినడంతో శ్యామాలోని

ఆటకాయితనం అదృశ్యమైంది. సంభ్రమాశ్చర్యాలతో మారుమాటాడలేకపోయాడు. సాయి లేచి ధుని చెంతకు వెళ్ళారు. ఇంతలో యీ అద్భుతవార్త ఊరంతా ప్రాకి జనం తండోపతండాలుగా వచ్చి ఆశ్చర్యంతో ఆ దివ్యమూర్తిని చూస్తూండిపోయారు. సుమారు మూడు దశాబ్దాలుగా ఆయనను నిత్యమూ చూస్తూండడం వలన ఆయన కేవలం కొద్దిపాటి వింతశక్తిని సాధించిన సామాన్య సాధువన్న భావం వారి హృదయాలలో ఏమైనా పేరుకొనివుంటే ఆ తుప్పంతా నేటితో వదలిపోయింది. తమ మధ్య తిరుగాడుతున్న శక్తి మృత్యువుకు గూడ అతీతమైనదని వారికర్థమైంది. తమనైనా మృత్యుసమయంలో ఆయన చెంతనుండి, భయంలేకుండా తమనుగూడా యీ దుఃఖసాగరాన్ని దాటించాలిగదా? “సాథీ ఆఖరుకా కియానకోయీ” అన్న ఆరతిపాట నాటితో సార్థకమైంది. ఆ దేహాన్ని మూడు రోజులుంచడానికి వీలులేదని పట్టుబట్టిన వారిలో కొందరికి మళ్ళీ మసీదు ప్రాంతంలో తిరగడానికి కొన్ని రోజులు పట్టింది. వాస్తవానికి ఈ మహాద్భుత సంఘటన తర్వాతనే సాయిబాబా కీర్తి మిన్ను ముట్టింది.

ఈ వార్త నాటి మధ్యాహ్నానికే అహ్మద్‌నగర్ జిల్లా కలెక్టరుకు చేరి మరురోజునే ఆయన సాయి దర్శనం చేసుకొన్నారు. ఆ సద్గురుని రూపంలో అలనాటి ఏసయ్యే వచ్చారేమోనన్నారు ఆ దొర. నిజమే! ఆ యిద్దరు సద్గురువుల జీవితవిధానము, పునరుద్ధానము, బోధలు ఎన్నో విధాల పోలియుంటాయి.

ఈ శీర్షికలోని ముఖ్యాంశాన్ని పూనాలో జరిగిన సాయిభక్తి సమ్మేళనంలో సాయిని ప్రత్యక్షంగా సేవించి, నాటికి సజీవులైయున్న ఒక భక్తశిరోమణి హైద్రాబాద్ వాస్తవ్యులు, సాయి భక్త శ్రీ ఎమ్.రంగాచారిగారికి చెప్పారు. ఆ వివరం విన్నాక తాము శ్రీ రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర గ్రంథం చూడగా అందులో పరమహంస సరిగ్గా ఆగష్టు 16, 1886న తెల్లవారుఝామున 1 గం॥ 2 ని॥లకు పరమపదించారని గమనించామని చెప్పారు. పరమహంసపేరు పూర్వాశ్రమంలో గదాధర్ అన్నది చరిత్ర. మిగిలిన వివరాలను శ్రీయుతులు మార్తాండ్, నానాసాహెబ్‌రాస్నే, మొదలైన భక్తులనుండి సేకరించాను. శ్రీ పరమహంస అంతటి మహనీయుల జీవితాలలోని పరమోత్కృష్టమైన ఆధ్యాత్మిక సంఘటనలలో శ్రీ సాయికి పరమాత్మ ప్రమేయాన్ని, బాధ్యతను కల్పించడమెంత అద్భుతము! మనయెదుట చిత్రాలలో వున్న ఆ పావనమూర్తి సాయీశుడసలెంతటివారో!

ఇది విన్న నాకొక సన్నివేశం గుర్తొచ్చింది. అప్పడు మరణానుభూతితో ఆత్మానుభూతిపొంది, యిల్లువిడచి తిరువణ్ణామలై బయలుదేరిన బాల రమణమహర్షికి రైలువద్ద ఒక ముస్లిం ఫకీరగపడి ఏ రైలెక్కి ఏ స్టేషనులో దిగవలినదీ హెచ్చరించారని వారి చరిత్రలో నున్నది. ఆయన సాయియేమోనని, పై విధంగా రైలు స్టేషన్ల గురించి ఆ ‘ముస్లిం’ చేసిన హెచ్చరిక ఆధ్యాత్మికమైన సంకేతమేమోనని, అనిపించింది.

---

# 'కిం వచనీయం గురు మహిమ!"

- సుషుమ్న

సాయివంటి సద్గురువు బోధించిన దానిని ఎంత పూర్ణంగా ఆచరిస్తామో అంత మేరకు మనం ఉత్తమ శ్రేయస్సును పొందుతాము. అయినా ప్రాపంచిక జీవనం కొనసాగిస్తూ అలా చేయడమెలా అన్నది మనలో చాలా మందికి తీరని సమస్యగానే వుంటుంది. ఈ సమస్యకు సమాధానం ఆ రీతిన ఆచరించి చూపినవారి జీవితాలే. అట్టి వారే మద్రాసులోని అఖిల భారత సాయి సమాజస్థాపకులైన కీ. శే. శ్రీ బి.వి. నరసింహస్వామీజీ.

శ్రీ నరసింహస్వామి (జననం: ఆగస్టు 21, 1874) సేలంలో ప్రఖ్యాత న్యాయవాది. వీరి కీర్తి వారి ధనార్జన వలన వచ్చినదిగాదు! న్యాయములేని కేసులను ఎంత డబ్బిచ్చినా చేపట్టకపోవడమూ, వ్యాజ్యాల మూలంగా ఎన్నెన్ని కుటుంబాలు సర్వనాశనమవుతున్నయో గుర్తించి, సాధ్యమైనంతవరకూ వారి సమస్యలను న్యాయస్థానానికి వెళ్ళకుండానే మధ్యస్థంచేసి పరిష్కరించడమూ, అవి ఆయన నియమాలు. అలా ఆర్జించినదే సాత్వికాహారమనీ, అదే సకల సాధనలనూ సార్థకం చేస్తుందని భగవద్గీత భావమనీ సాయి తెల్పిన విషయాన్నే ('శ్రీ సాయి ప్రబోధామృతము'లో వివరించినట్లు) ఆయన ఆచరించారు.

అంతేగాక, ఒకవంక స్వరాజ్యసాధనోద్యమంలో దీక్షతో పాల్గొని తమిళదేశంలోని వివిధ పల్లె ప్రాంతాల్లో యీ ఉద్యమానికి అంకురార్పణచేసి, మహాత్మాగాంధీకి కుడిభుజంగా నిలచారు స్వామిజీ. మరొకవంక స్థానికమైన దేవాలయాలను పునరుద్ధరించడమూ, వివిధ భక్తి కార్యక్రమాలలో పాల్గొంటూ తమ వ్యక్తిగత పూజసంధ్యాదులను అకుంఠితదీక్షతో కొనసాగించిన కర్మయోగి. తమ యావచ్ఛక్తినీ ప్రజోపకారంలో వినియోగించడంలో ఆయన నిష్కామ కర్మయోగియన్న విషయం స్పష్టమవుతుంది. అట్టి వారికి మాత్రమే చిత్తనైర్మల్యం కలిగి, సద్గురువును సేవించి కృతార్థతనొందగల సామర్థ్యం గల్గుతుందని శృతులు చెప్తాయి. ఇట్టి నిష్కామ సేవచేయనిదే ఎన్ని పూజాదులు చేసినా నిరర్ధకమనడానికి తక్కిన జనబాహుళ్యమే తార్కాణం. నేడు పవిత్ర కార్యాలను చేపట్టినవారు మధ్యలో పరస్పర ద్వేషాసూయలకులోనై తమను, తమ కృషినీగూడ కలుషితం చేసుకొనడానికి గూడ యీ వెలితే కారణమని అట్టివారి జీవితాలు నిరూపిస్తాయి.

పవిత్ర కార్యాలను చేపట్టినవారి అర్హతను, వారు సాధించిన పరిపాకాన్నీ పరీక్షించేవి జీవిత సంఘటనలే! అందులోనూ దుఃఖశోకాలను కల్గించేవి. శ్రీస్వామిజీ యిద్దరు కుమారులూ 1921లో ఒకే రోజు ప్రమాదవశాత్తు బావిలోపడి మరణించారు. మరొక జీవికింతటితో భగవంతునిపై అవిశ్వాసమో, ద్వేషమోకల్గి భక్తి మర్గంనుండి వైదొలగేవారే. కాని స్వామిజీ తమ లౌకికకార్యాలను, సంసార బంధాలనూ, సిరిసంపదలనూ వీడి పూర్ణ ఆత్మాన్వేషణకు సంసిద్ధులయ్యారు. నాటి శృంగేరీ పీఠాధిపతులైన జగద్గురు శంకరాచార్యులవద్ద మంత్ర దీక్షను స్వీకరించి, భగవాన్ రమణమహర్షి సన్నిధిలో ఒక గుహలో తీవ్రతపస్సు చేస్తూ వానప్రస్థ జీవితం కొంతకాలం గడపారు. కాని భక్తి ప్రధానమైన వారి సంస్కారం ఆ మహనీయుని జ్ఞానబోధకు తృప్తిపడక వారి అనుజ్ఞతోనే పండరీపురం చేరి నిరంతర భజనలలో కొంతకాలం గడిపారు. తరువాత ఆత్మానుభూతికి సద్గురువును ఆశ్రయించదలచి నాటి ప్రఖ్యాత మహనీయులైన శ్రీ నారాయణ

మహరాజ్ (ఖేడ్గాంవ్‌భేట్ నివాసి) గారిని దర్శించి, తామొక వజ్రాల వర్తకుడనని పరిచయం చేసుకొని తామొక అత్యుత్తమమైన వజ్రం కోసం వెదకుతున్నామనిచెప్పి, తమకు గమ్యం తెల్పమనికోరారు. ఆ మహనీయుడు వీరి సంకేత భాషను అర్థం చేసుకొని ఉత్తర దిశగా వెళ్ళమని చెప్పారు. ఆ పర్యటనలో మొదట పూనాలోని శ్రీ మెహర్‌బాబాను దర్శించి, అచటనుండి వారి గురువైన శ్రీ ఉపాసనీబాబాను సాకోరిలో దర్శించి, అక్కడ కొంతకాలమున్నారు. ఆ సత్పురుషునివద్ద వారిగురువైన శ్రీసాయిబాబా మహిమను గూర్చివిని, 1936లో శిరిడీ చేరారు. అచ్చటి దివ్య సమాధి దర్శనం చేతనే తమ అన్వేషణ పూర్తయిందన్న ఆనంద పారవశ్యాన్ని చెందారు శ్రీ నరసింహస్వామిజీ, "ఆ సజీవ చైతన్యానికి ఆత్మ సమర్పణ చేసుకున్నాను" అన్నారు శ్రీస్వామిజీ. నాటి నుండి వారి హృదయంలో "నేను" అన్న అహంకారం తొలగి, దానిస్థానే అనన్య సాయిభక్తియే తాండవించింది.

మధువును గ్రోలి మైమరచిన మధుపం తన ఆనందాన్ని లోకానికి ఝుంకారంగా చాటినట్లు, వీరి మిగిలిన జీవితశేషమంతా సాయిబాబా ప్రచారానికి అంకితమైంది. సాయి అద్భుతరీతిన ఒక భక్తుని రూపంలో ప్రసాదించిన రూ.11,145/- లతో మద్రాసులో అఖిలభారత సాయి సమాజాన్ని స్థాపించి, శ్రీసాయి గూర్చి ఎన్నో గ్రంథాలు, వ్యాసాలు ప్రచురించి, దేశమంతటా పర్యటించి సుమారు 700 వరకూ సాయి భక్త సంఘాలనేర్పరచిన సాయిదూత శ్రీ నరసింహస్వామిజీ. ఇదంతా భౌతికంగా తమకు పరోక్షులైన సద్గురువుకు వీరు సేవచేసి మనకు వెలుగు బాటను చూపడమేనని గుర్తించాలి. తమకవసరంలేకున్నా శ్రీ సాయి ద్వారకామాయియందు దీపాలను వెల్గించియుంచడంలోని సంకేత సందేశమిదేనేమో! "సేవయా" అన్న భగవద్గీత (అధ్య 4, శ్లో॥ 32) వాక్యానికి సాయి యిచ్చిన వివరణకు ప్రత్యక్ష తార్కాణం వీరి జీవితం. చివరిదశలో వీరు మైలాపూర్ (మద్రాసు) లో శ్రీ సాయిబాబా మందిర నిర్మాణం పూర్తి చేసి తమ జీవితాన్నే సాయి మందిరంగా మలచుకొన్నామని లోకానికి తెల్పడానికా అన్నట్లు 1953లో దాని కుంభాభిషేకం తర్వాత 1956లో సాయి మహా సమాధి వుత్సవం పూర్తికాగానే మరు రోజు తెల్లవారు ఝామున (అక్టోబర్ 19, 1956) భక్తులు సాయినామ సంకీర్తన చేస్తూండగా శ్రీ సాయి సాయుజ్యంచెందారు. ఎందరి హృదయాలనో తమ ప్రచారంద్వారా సాయిమందిరాలుగా రూపొందించాకనే, కేవలం అందుకు బాహ్య చిహ్నంగా మాత్రమే భౌతికమైన సాయి మందిరాన్ని వారు రూపొందించి, దానిని నిర్దుష్టమైన సాయి తత్వ పాఠశాలగా నిర్వహించి, మనకు మార్గదర్శకులయ్యారు స్వామిజీ. యావద్భారత దేశంలోనూ వెల్లువగా నేడు శిరిడీసాయి భక్తి తాండవించడానికి వీరే ప్రధాన సూత్రధారులు. కనుకనే వారంత వినమ్రంగా "నేను కేవలం సాయి సేవకుడిని మాత్రమే" అని చెప్పినా వారి భక్తులు వారిని సాయి స్వరూపులుగా తలచారు. స్థూలదృష్టికెలా కనబడినా వారీనాటికీ ఆరాధించేది శ్రీ నరసింహస్వామిజీ హృదయంలోనుండి వెలుగులుజిమ్మిన నిశ్చల సాయిభక్తినే! ఇది గురుమహిమలోని రహస్యం. గురు సేవా రహస్యం!!

# అవధూత శ్రీ చివటం అమ్మ

## అమ్మ - మాస్టర్ గారు

**(అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధనా మహోత్సవ ప్రత్యేక వ్యాసం - అమ్మ చరిత్ర నుండి)**

శ్రీ భరద్వాజ మాస్టర్‌గారు 1963లో బాబావద్ద దివ్యానుభూతిని పొందిన తర్వాత, బాబాను సశరీరులుగా చూడలేకపోయాననే అన్న బాధపడేవారు. కనీసం ఇప్పుడు జీవించి వున్న పూర్ణ పురుషుల దర్శన ఆశీస్సులైనా ప్రసాదించమని బాబాను ప్రార్థించారు. అప్పటినుంచి వారికి అనేకమంది మహాత్ముల దర్శన, ఆశీస్సులు లభించాయి. అట్టివారిలో శ్రీ చివటం అమ్మ ఒకరు.

కానీ, నిశితంగా గమనిస్తే, మాస్టర్‌గారు మనకు మార్గదర్శకులుగా వుండటం కోసమే, సాధకునివలే వ్యవహరించేవారని అర్థమౌతుంది. నిజమైన సత్పురుషుడు సిద్ధుడై వుండికూడా సాధకుడైనట్లే వ్యవహరించాలని శాస్త్రం. వారు తమ అంతిమ శ్వాసవరకూ బాబాయొక్క సచ్ఛిష్యులుగానే వ్యవహరించారు. శిష్యునికుండవలసిన నమ్రత, నిరహంకారము వారిలో స్పష్టంగా గోచరించేవి. కానీ, నిజానికి వారి స్థితి ఎవరికీ అంతుపట్టనిది.

చివటం అమ్మ సాయిబాబాను "పెద్దబాబు" అనీ, మాస్టర్‌గారిని "చినబాబు" అనీ అనేవారు. 'సాయి బాబాకా బేటా' అన్నారు, శ్రీ గుణవణి మహారాజ్. శ్రీ గోపాలస్వామి, 'భరద్వాజ్ భగవాన్‌కీ సమాన్ హై' అన్నారు. "శ్రీ సాయిని ప్రతి ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో నింపుకున్న ధన్యజీవి" అన్నారు శ్రీ పూర్ణానంద స్వామి. "పెద్దవారు - పెద్దవారు - చాలా పెద్దవారు" అన్నారు శ్రీ నాంపల్లి బాబాగారు. "ఋషి, ఋషి" అన్నారు పరాడ్‌సింగా అనసూయమాత. శ్రీ రాఖాడి బాబా, "నీవు ఎక్కడ నమస్కరిస్తే అక్కడ సాయినాధుని పాదాలే వుంటాయి" అన్నారు.

మాస్టర్‌గారి నిర్యాణానంతరం రామారావు అనే శిష్యుడు విజయవాడలోని ఒక అవధూతను కలిసి, మాస్టర్‌గారి గురించి ప్రశ్నించగా, ఆయన సైగలతో "మూడు ముఖాలు కలిగిన దత్తమూర్తే శ్రీ మాస్టర్" అనిచెప్పారు.

అంతేగాక సం॥ 1969లోనే శ్రీ పాకలపాటి గురువుగారికి స్వప్నంలో శంఖ-చక్రధారియై కన్పించారు. ఇంకా ఎందరో భక్తులకు కల్గిన, కల్గుతున్న ఎన్నెన్నో అనుభవాలు కూడా వారు గొప్ప మహాత్ములని ఋజువుచేస్తున్నాయి. అంతేగాక, వారి రచనలు చదివినా, వారి బోధలు విన్నా వారు ఆచరించిన అతి నిరాడంబరమైన, ధర్మబద్ధమైన జీవిత విధానాన్ని గమనించినా, మనకు గురుతత్వమే వారి రూపంలో అవతరించిన దన్పిస్తుంది. **కాబట్టి వారు సాక్షాత్తూ దత్తాత్రేయ స్వరూపులు.** అట్టి మహనీయులైన మాస్టర్‌గారు అమ్మను మొట్టమొదటిసారిగా దర్శించిన కమనీయ ఘట్టం ఎలా ఉందో చూద్దాం!

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారు 1973 సెప్టెంబర్‌లో ఏలూరుకి స్పాట్ వాల్యూయేషన్‌కు వెళ్లారు. అక్కడ చివటం అమ్మగురించి మొట్టమొదటిసారిగా తెలుసుకొని, ఒక ఆదివారంనాడు అమ్మ దర్శనానికై బయలుదేరారు. ఇద్దరు ముగ్గురు మిత్రులు కూడా అమ్మ దర్శనం చేసుకోవడానికి ఉత్సాహం చూపడంతో వారినికూడా వెంటబెట్టుకొని, తణుకుచేరి, అక్కడనుంచి కాలినడకన చివటం బయలుదేరారు. చివటం ఊరి

పొలిమేరకు చేరేసరికి, అమ్మ రోడ్డుమీద ఎదురుగా వస్తూ వీరికి కన్పించారు. దిగంబరియైన ఆమెను అమ్మగా గుర్తించిన మాస్టర్‌గారు నమస్కరించుకోవడానికి అమ్మను సమీపిస్తుండగా, అమ్మయే స్వయంగా, ఆ రోడ్డుమీద సాష్టాంగపడి మాస్టర్‌గారికి నమస్కారం చేశారు. అమ్మ లేవగానే మాస్టర్‌గారు అమ్మచేతికి పూవులు, పండ్లు సమర్పించుకొని సాష్టాంగ నమస్కారంచేసుకొన్నారు. ఈ సంఘటన గూర్చి అడిగినవారితో మాస్టర్‌గారన్నారు – "అందరిలోనూ ఆ పరమాత్మను దర్శించే అవధూతలు ఎందుకలా చేస్తారో చెప్పడం కష్టం. ఇందులో మన గొప్పదనం వుందనుకోవడం అవివేకం" అన్నారు.

మాస్టర్‌గారు మళ్ళీ 1980 నవంబరులో అమ్మ దర్శనార్థం వెళ్లారు. ఈసారి వారు అమ్మవద్ద మూడురోజులున్నారు. మాస్టర్‌గారిరాక గురించి తెలుసుకున్న అమ్మ చాలా సంబరపడిపోయారు. ఆనాటి సంఘటనలను గూర్చి ఆ గ్రామస్థులిలా చెప్పారు : "మాస్టర్‌గారు వస్తున్నారన్న విషయం విన్న అమ్మ ఆనందానికి అవధులులేవు. "బాబు వస్తున్నాడే! బాబు వస్తున్నాడు" అంటూ ఎంతో హడావుడిచేశారు. కుటీరానికి, రామాలయానికీ సున్నాలు వేయించారు. కుటీరాన్ని శుభ్రంగా అలికించి ముగ్గులు పెట్టించారు. మాస్టర్‌గారు వచ్చే సమయానికి పెద్ద హండాలలో స్నానానికని నీళ్లుకాగించి వుంచారు. పిండివంటలతో భోజనం సిద్ధంచేయించారు. అమ్మ సేవచేసే కుమారి భాస్కరి ఇలా చెప్పారు: "అమ్మకు మాస్టర్‌గారంటే ఎంత ఇష్టమో! మాస్టర్‌గారు వస్తున్నారంటే ఊరంతా ఆనందంతో మునిగిపోయింది. ఎవరినోటవిన్నా "మాస్టర్‌గారు వస్తున్నారు, మాస్టర్‌గారు వస్తున్నారే" అన్న మాటలే! ఊరంతా పెద్ద పండుగ జరుపుకుంటున్నంత ఉత్సాహంగా వున్నారు."

మాస్టర్‌గారు వచ్చి నమస్కరించుకున్నాక, అమ్మ వారికి ప్రసాదం పెట్టారు. అన్నం కలిపి ముద్దలు నోట్లోపెట్టి తినిపించారు. తాము కొంత తింటూ, మాస్టర్‌గారి నోట్లో పెడుతున్న దృశ్యం చూసితీరవలసిందే! ఎన్నాళ్లకో తనచెంతకు వచ్చిన కొడుకుపై చూపే ఆప్యాయత, ప్రేమ, వాత్సల్యాలు అమ్మ చర్యలో కొట్టవచ్చినట్లు కనిపించాయి.

మాస్టర్‌గారు మరుసటి ఉదయం అమ్మకు పూజచేయాలని సంకల్పించారు. రామాలయంలో పూజకు ఏర్పాట్లు జరిగాయి. మాస్టర్‌గారు అమ్మకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజచేశారు. నామావళి చెబుతూ అమ్మకు పుష్పాలతో పూజచేస్తుంటే, అమ్మ సాయిబాబా ఫోటోను తన ఒడిలో ఉంచుకొని, ఆ పుష్పాలను బాబాకు సమర్పిస్తున్నారు. దిగంబరావధూత, దత్తస్వరూపిణి అయిన అమ్మకు మాస్టర్‌చేసే దివ్యపూజను చూసి తీరవలసిందే! హేమాద్పంతు సాయిబాబా గురించి చెప్పినట్లు, ఆ దృశ్యం కన్నులారా చూసి తరించాల్సిందేగానీ, వర్ణించడం సాధ్యంకాదు. ఒక దత్తమూర్తికి, మరొక దత్తమూర్తి చేసిన ఆ దివ్యపూజ చరిత్రలోనే అపూర్వ ఘట్టం! రామాలయమంతా ఒక దివ్యమైన ఆధ్యాత్మిక శక్తితో నిండిపోయింది. అక్కడ కూర్చున్న భక్తులందరూ ఆనంద పారవశ్యంలో ఓలలాడారు. పూజపూర్తయిన తర్వాత అమ్మకు మాస్టర్‌గారు సాష్టాంగనమస్కారం చేశారు. అమ్మ మాస్టర్‌గారికి తీర్థప్రసాదాలిచ్చారు. ఆ తర్వాత ఒక్కొక్కరే వచ్చి అమ్మకు, మాస్టర్‌గారికి నమస్కరించుకొని, అమ్మచేతితో తీర్థ ప్రసాదాలనందుకొన్నారు. ఆ సాయంత్రం రామాలయంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు సత్సంగం జరిపారు. సత్సంగం

జరిగినంతసేపూ అమ్మ మౌనంగా కూర్చుని వింటున్నారు. మాస్టర్‌గారు అక్కడివారినుద్దేశించి ఇలా ప్రసంగించారు.

పూర్ణజ్ఞాని అయిన అమ్మ సన్నిధిలో వున్న వారికి బోధించవలసినది ఏమున్నది? అమ్మ సన్నిధిలో వున్న మీరెంతో అదృష్టవంతులు. మీరు చేసుకున్న పూర్వపుణ్యం వలన ఇంతటి భాగ్యం లభించింది. ఈ అమూల్యమైన అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలి. భౌతికంగా మహాత్ముని దర్శనం లభించినా, ఆయనకూడా చూడటానికి మానవాకారం కలవాడవడం వల్ల, భక్తులు ఆయనను కేవలం సామాన్య మానవమాత్రుడుగా భ్రమించే ప్రమాదమున్నది. అట్టి చనువే కృష్ణుడి పరమాత్మ తత్వాన్ని అర్జునుడు పదే పదే విస్మరించేలా చేసింది. ఆ కారణంగానే సాయితో చనువుననుభవించిన శ్యామా కూడా సాయి సశరీరులై వుండగా హృదయపూర్వకంగా వారినెన్నడూ పూజించలేకపోయాననీ, సాయి గొప్పతనాన్ని పూర్తిగా గుర్తించలేకపోయాననీ, సాయి నిర్యాణానంతరం వాపోయాడు.

'అమ్మవంటి జ్ఞానులు మన మధ్య జీవించడం ఎంతో అరుదు. వారు సాక్షాత్తూ దత్తాత్రేయ స్వరూపులు. అమ్మ వాచా ఏమీ బోధించరు. ఆమె పరిపూర్ణ జ్ఞాని కనుక, ఎవరికీ బోధించడమనేది వుండదు. అమ్మ మౌనమే నిరంతర బోధ. అమ్మ అప్పుడప్పుడూ మామూలుగా చెప్పే మాటలే గొప్ప ఉపదేశాలు. వాటిని ఆచరించడానికి ప్రయత్నించండి. అమ్మ రూపాన్నే చూస్తే, ఆ రూపంలోని దివ్యత్వాన్ని, చింతన చేస్తూ, ఆమె ఆచరణద్వారా మనకందించే బోధను గ్రహించాలి. సమయాన్ని వృథాచేయకండి. "తల్లికి తగ్గ బిడ్డలుకండి – మీ (ఆధ్యాత్మిక) భాండాగారాలను నింపుకోండి" అన్నారు బాబా. అలాగే మనం కూడా అమ్మకు తగిన బిడ్డలుకావాలి. అమ్మ తాను ఆచరించి చూపిన జీవన విధానాన్ని మనం అనుసరించాలి. నన్నేకాదు – మీరెప్పుడూ, ఎవరినీ, ఏమీ అడగనవసరంలేదు.'

మూడవరోజు సాయంత్రం తణుకులో పూజ్యశ్రీ మాస్టర్‌గారి ఉపన్యాసం ఏర్పాటుచేశారు. అప్పుడు అమ్మ చివటంలోని భక్తులందరినీ, ఆ ఉపన్యాసం వినమని పంపించారు. ఆ రాత్రి మాస్టర్‌గారు అమ్మ వద్ద సెలవు తీసుకున్నారు. అమ్మ మాస్టరుగారికి ప్రసాదం ఇచ్చి, బయటకు వచ్చి మరీ సాగనంపారు.

మాస్టర్‌గారు వీలున్నప్పుడల్లా చివటం వెళ్లి అమ్మ దర్శనం చేస్తూండేవారు. తమవద్దకు వచ్చిన వారికి అమ్మ యొక్క మహోన్నత స్థితిని గూర్చి చెబుతూ, అమ్మను దర్శించుకోమని చెప్తుండేవారు. మాస్టర్‌గారివద్ద నుండి వచ్చిన ప్రతివారినీ అమ్మ ప్రత్యేక రీతిన అనుగ్రహించేవారు. వారిని ఎంతో ఆదరించి, వారికై భిక్షతెప్పించి, తానే స్వయంగా కలిపి ముద్దలుపెట్టి, వారికి కడుపునిండా తినిపించేవారు. అమ్మ ఆదరణను పొందినవారు అమ్మ వద్ద నుంచి వచ్చిన చాలారోజుల వరకూ ఆనందపారవశ్యంలో మునిగిపోయేవారు. అమ్మ మాస్టర్‌గారికీ, సత్సంగ సభ్యులకూ తరచూ ప్రసాదాలు పంపేవారు.

ఒక భక్తుడు అమ్మకు మాస్టర్‌గారు వ్రాసిన శ్రీ సాయి లీలామృతము చూపించారు. అమ్మ దానిని చదివించుకొని విన్నారు. అప్పటినుండి అమ్మ భగవద్గీతతో పాటు, శ్రీ సాయి లీలామృతాన్ని చదివించేవారు. అమ్మకు సాయిబాబా అంటే ఎంతో ఇష్టం. వారి భక్తులెంతోమందిచేత అమ్మ సాయిలీలామృత పారాయణ

చేయించారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు విద్యానగర్‌లో నిర్మిస్తున్న శ్రీ శిరిడీ సాయిబాబా మందిరానికి అమ్మ తమ ఆశీస్సుల నివ్వడమేగాక, రూ. 116-00 విరాళంగా పంపారు. అంతేగాక, ఆ మందిర కుంభాభిషేకానికి తమ భక్తులను పంపించారు. పెద్దబాబు (సాయిబాబా)కు వేయమని రెండు రూపాయలిచ్చి పంపారు. విద్యానగర్‌లో కుంభాభిషేకం జరుగుతున్న సమయంలో చివటంలో అమ్మ శ్రీ సాయిబాబాకు పూజచేయించారు. మాస్టర్‌గారినీ, వారి కార్యక్రమాలనూ అమ్మ ఎంతగా ఆదరించేవారో తెలుసుకోవడానికి శ్రీ విస్సయ్య పంతులుగారు మాస్టర్‌గారికి వ్రాసిన ఈ క్రింది ఉత్తరమే ఒక ఉదాహరణ.

---

తణుకు,

17-3-81

పూజ్యశ్రీ మాస్టర్‌గారి పాదపద్మములకు తణుకునుండి విస్సయ్య పంతులు నమస్కరించి వ్రాయునది. శ్రీ శిరిడీ సాయినాధునికీ, మీకు, మీ కుటుంబసభ్యులందరికీ నమస్కారములు. నిన్నటి దినమున (16-3-81) సాయంత్రం మా కుటుంబసభ్యులు అందరము శ్రీశ్రీశ్రీ అమ్మగారి వద్దకు వెళ్లితిమి. అమ్మగారి దర్శనానంతరము మా కుటుంబసభ్యులము అందరమూ మనిషిమనిషి చొప్పున మీ కుటుంబసభ్యుల, శిష్యుల - అందరి నమస్కారములు శ్రీశ్రీశ్రీ అమ్మగారికి అందజేసితిమి. అమ్మగారి ఆనందమునకు ( ఆ సమయమున) అవధులు లేవు. అక్కడికి వచ్చిన సత్సంగ సభ్యులు అందరితో శ్రీశ్రీశ్రీ అమ్మగారు “చూడండే, చూడండి. భరద్వాజబాబు నాకు నమస్కారములు చెప్పారట” అని పకపక ఆనందంతో పరవశించిపోయిరి. తరువాత నేను తీసిన ఫోటోలు శ్రీశ్రీ అమ్మగార్కి యిచ్చాను. అమ్మ ఆ ఫోటోలో, బాబాగారి ఫోటోను, మందిరం ఫోటోను చూచి కళ్లకద్దుకొనిరి. ఇక్కడి సత్సంగ సభ్యులకందరికీ ఆ ఫోటోలందించి, “చూడండర్రా! మనం అక్కడికి వెళ్లకపోయినా బాబు ఫోటోలు వచ్చాయి. అమ్మో! బాబు ఇంత పెద్ద మందిరం కట్టించాడా? చాలా బాగుంది,” అని నుడివిరి. తరువాత మా కుటుంబసభ్యులు ఒక్కొక్కరము తమరు ఇచ్చిన రూపాయి నాణెములను అమ్మచేతికిచ్చితిమి. అప్పుడు అమ్మ “అమ్మో! చూడండర్రా, బాబు పెద్దవాళ్ల దగ్గర్నుంచి చిన్నబాబు దాకా మనిషికి మూడు రూపాయలు యిచ్చారు. అమ్మా! మీరు అందరూ ఈ రూపాయలు పూజలో వుంచుకోండి. ఖర్చుపెట్టకండి” అని అనుజ్ఞయిచ్చిరి. తరువాత అక్కడ 12వ తేదీన జరిగిన ఉత్సవ విషయములు అన్నియు ఒక్కొక్క విషయం శ్రీ అమ్మగారికి చెప్పగా అమ్మ అమితానందంతో ఉప్పొంగిపోయారు. (నిజం చెప్పాలంటే చంటిపిల్లలకు మనం వాళ్లకిష్టమైన వస్తువులు చూపించితే వాళ్లు ఏరీతిగా చంకలు ఎగురవైచి ఆనందంతో పరవశించిపోతారో ఆ రీతిగా అమ్మగారు చంకలు ఎగురవైచిన రీతిచూచిన మాకు ఒడలు గగుర్పొడిచినది) “బాబు చాలా కష్టపడ్డారయ్యా! మన సుధీంద్రబాబు, భరద్వాజ బాబు ఒక్కటేనమ్మా!” అని పల్కిరి. తర్వాత మేము ఒక్కొక్కరము దత్తసాయి ఫోటోను, మీ ఫోటోను శ్రీ అమ్మగార్కి యివ్వగా ఆ ఫోటోలను కళ్లకు అదుముకొని అక్కడ వున్న సత్సంగసభ్యులు అందరికీ ఆ ఫోటోలు చూడమని అమ్మ పల్కి, దత్తసాయి ఫోటోలోని సాయిబాబాను అమ్మ చాలా మెచ్చుకొనిరి. “అయ్యో! ఇటువంటి

ఫోటోలు యిక్కడున్న వాళ్లకు కూడా తేకపోయారా; తీసుకురావల్సిందండి", అని పల్కిరి. తర్వాత మీరు మా అందరకు యిచ్చిన ప్రసాదాలలో మా చెల్లెలికిచ్చిన పొట్లం తీసుకొని చించి అందులోని ఊధి, ప్రసాదమును అందరికీ పంచమనిరి. తరువాత అక్కడచేరిన భక్తులందరిచేత, "హరేరామ హరేరామ రామరామ హరే హరే" అను నామజపం 5 ని॥లు చేయించి, హారతి యిప్పించి, ప్రసాదమును అమ్మగారు స్వయంగా యిచ్చిరి.

మాస్టర్ గారండీ! ముఖ్యమైన విషయం ఏమిటంటే 12వ తేదీన (ప్రారంభోత్సవంనాడు) మా భాస్కరం అక్కను అమ్మ తనదగ్గరే వుంచుకొని బాబా పూజ జరిపించుతూ అక్కడకు చేరిన సత్సంగసభ్యులతో 12వ తేదీన విద్యనగర్‌లో 7-8 గం॥ల మధ్య బాబా పటం ఊరేగించుతున్నట్లుగా యిక్కడ చివటంలో అమ్మ చెప్పారట. తరువాత మీరు పీటలమీద కూర్చున్నట్లుగా, శిఖరమునకు పసిడికుండలు పెడ్తున్నట్లుగా, ఫలానా టైముకి అన్నసమారాధన జరుగుతున్నట్లుగా చెప్పారట. మేము ఇంటికి వచ్చిన తర్వాత మాతో యోచించగా, సరిగా మేము చెప్పిన టైమింగ్స్, అమ్మ చెప్పిన టైమింగ్స్, ఒకేరీతిగ ఉండటం చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది. దీనిని బట్టి ఆలోచించగా శ్రీశ్రీ అమ్మగారు విద్యానగర్ వచ్చే వుంటారని మా కుటుంబసభ్యులు అందరము అనుకున్నాము. ఆ జగజ్జననికి తెలియనిదే లేదని వ్యక్తమవుతున్నది.

ఇట్లా జరిగిన తర్వాత, మీకు ఈ సంగతులన్నీ వెంటనే లెటర్ వ్రాయాలనిపించింది. ఎందుచేతనంటే మరల అమ్మ పల్కిన పలుకులు నాకు జ్ఞాపకముండక పోవచ్చునను ఉద్దేశ్యముతో ఈ లెటరు వెంటనే వ్రాస్తున్నాను. అక్షరదోషములు దయతో మన్నించ ప్రార్ధన. చిత్తగించవలెను.

ఇట్లు,
మీ శిష్యుడు
విస్సయ్యపంతులు
17-3-81

పూజ్యశ్రీ మాస్టర్‌గారు ఒకసారి కుటుంబసమేతంగా అమ్మను దర్శించారు. అమ్మకు పూజ్య మాస్టరుగారి దంపతులు, మాస్టర్‌గారి పుత్రిక చి॥ వేదవతి పూజచేసుకున్నారు. మాస్టర్‌గారినీ, వారి శ్రీమతిగారినీ, వారి పాపనూ ఎంతో ప్రేమ, వాత్సల్యాలతో ఆదరించారు. పాపకిష్టమైన వంటకాలు దగ్గరుండి వండించి పెట్టారు. మాస్టర్‌గారి శ్రీమతి గారిక్కూడా తమ స్వహస్తాలతో అన్నం తినిపించారు.

అమ్మ తమ భక్తులతో మాస్టర్‌గారి గురించి ఎంతో గొప్పగా చెప్తుండేవారు. ఒకసారి మాస్టర్‌గారి గురించి తమ భక్తులతో చెప్తూ అమ్మ "ఆ బాబుకి ఎంత జీతం వస్తే, అంతా పైసా! పెట్టు-పెట్టు! ఉరుకులూ-ఉరుకులూ" అన్నారట. అంటే మాస్టర్‌గారికి వచ్చే జీతమంతా దానధర్మాలకూ, సాయిసేవలో దేశమంతా తిరగడానికే సరిపోతుంది అని! నిజానికి మాస్టర్‌గారు ఒక్కపైసా కూడా రేపటికని దాచుకోలేదు. ఎంతమంది విద్యార్థులకూ, అర్థార్థులకూ రెండోకంటికి తెలియకుండా దానం చేసేవారో! ఈ గుప్తదానాలన్నీ అమ్మకు తెలియడమే ఆశ్చర్యం!

అంతేగాదు, మాస్టర్‌గారికి పుత్రుడు జన్మించబోతున్నాడని కూడా అమ్మ ముందుగానే చెప్పారు. విద్యానగర్

కుంభాభిషేకానికి వెళ్లివచ్చిన లక్ష్మిగారు అమ్మతో మాస్టర్‌గారి శ్రీమతి గర్భవతి అన్న సమాచారం అందిస్తూ, "అమ్మా! సాధువులకు పిల్లలేంటమ్మా?" అన్నారట! అప్పుడమ్మ, "వ్యాసుడికి శుకుడుట్టినట్టేనే, వ్యాసుడికి శుకుడుట్టినట్టే" అన్నారట. ఆ విధంగా మాస్టర్‌గారి బాబు చి॥ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ జననాన్ని అమ్మ ముందుగానే వెల్లడిచేశారు. అంతేగాక, అమ్మగారికి 5వ నెలలో చలిమిడి, పటిక బెల్లం, చీర పంపించారు.

విద్యానగర్ సాయిమందిర కుంభాభిషేకం సందర్భంగా ప్రచురించబడిన 'సద్గురు దర్శనము' అనే సంచికను అమ్మకు చదివి వినిపిస్తుంటే అమ్మ, "బాబు ఎంత తిరిగాడే, ఎంత కష్టపడ్డాడు, ఎన్ని విషయాలు సేకరించాడే" అన్నారు. ఆ సంచికలో ప్రచురించబడిన అమ్మ గురించిన వ్యాసం చదువుతుంటే, అమ్మ అక్కడ నుంచి లేచి బయట అరుగుమీద కూర్చుని, "ఒసే, ఎర్రమంగీ! ఇవన్నీ నువ్వుమోశావటే!" అన్నారు. నిజానికి, ఆ వ్యాసంలోని సంగతులన్నీ మంగమ్మగారి ద్వారానే తెలిశాయి! మాస్టర్‌గారు చివటం వెళ్లినప్పుడల్లా, అమ్మ సన్నిహిత భక్తులతో అమ్మ దినచర్యను, సంభాషణలనూ, అమ్మతో వారికి గల అనుభవాలనూ ఎప్పటికప్పుడు వ్రాసి వుంచమని చెప్పేవారు.

అమ్మ ఎవరు తమ చరిత్రను వ్రాస్తామని అడిగినా వద్దనేవారు. ఒకసారి కట్టా సత్యంగారు అమ్మను ఇలా అడిగారు – "మా ఊరిలోని వారొకరు స్వామి శివానంద మొదలైన వారి చరిత్రలు వ్రాశారు. మీ చరిత్రకూడా వ్రాయాలంటున్నారు. మీరు చెబితే వ్రాస్తారట. నన్ను అడగమన్నారు." దానికి అమ్మ "నాకు చరిత్ర ఏముందని? – వారంతా మహాత్ములు – నాకు ఏమి తెలుసని! ఏమి చేశానని? అయినా వెనుక జరిగిన చరిత్రంతా మరలా గుర్తుకుతెచ్చుకొని చెప్పడం, ఎప్పుడో కక్కినకూడు మరలా తిన్నట్లే – వారలా అడుగుతూ వుంటారు. నాకు తెలియదని ఊరుకో – నాకు చరిత్రావద్దు ఏమీ వద్దు" అన్నారట.

అటువంటి అమ్మ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారికి మాత్రం తమ చరిత్రను వెల్లడించడానికి అనుజ్ఞ ఇచ్చారు. అసలు మాస్టర్‌గారు అమ్మను దర్శించడంలోను ఆంతర్యమే అదేనేమో! ఎవరికి తెలుసు!

---


చదవండి! చదివించండి!!

**అవధూత చివటం అమ్మ చరిత్ర**

తెలుగు : శ్రీమతి శారదా వివేక్

వెల : రూ॥ 40-00 లు

ప్రతులు:- **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,**

c/o, **Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,

Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**



# శ్రీ సాయి సచ్చరిత్ర



మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మే సంచిక తరువాయి
అధ్యాయం - 50

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః,
శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః శ్రీ సద్గురు సాయినాథాయ నమః



నాకు ఈ జన్మను ప్రసాదించిన తల్లిదండ్రుల ఉపకారానికి అంతులేదు. వారే నాకు ఈ మానవ జన్మను ప్రసాదించారు. వారి కడుపున నేను క్రిమిగా జన్మించలేదు (1). నా తల్లికి కడుపు శోకం కలిగేటట్లుగా నేను గ్రుడ్డివాడుగానో, కుంటివాడుగానో, చెవిటివాడుగానో, మూగవానిగానో లేక అవిటివాని గానో జన్మించలేదు. అన్ని అవయవాలతో పుష్టిగా, సవ్యంగా పుట్టాను (2). ఎవరికైతే దేవతలుగూడ పాదాభివందనం చేస్తారో, అట్టి బ్రాహ్మణ కులంలో భగవంతుని అనుగ్రహంవల్ల జన్మించాను. అట్టి ఉత్తమ జన్మమెత్తిన నేను నిజంగానే ఎంతో అదృష్టవంతుడిని (3). మనం జన్మించిన కోటానుకోట్ల జన్మలలో ప్రతి జన్మలోనూ తల్లిదండ్రులుంటారు. కానీ ఈ జననమరణాల చక్రం నుంచి తప్పించి ముక్తిని ప్రసాదించే తల్లిదండ్రులు దొరకడం చాలా దుర్లభం (4). జన్మనిచ్చినవాడు మొదటి తండ్రి. ఉపనయం చేసినవాడు రెండవ తండ్రి. భుక్తిని ప్రసాదించేవాడు, సంకటాలనుండి రక్షించేవాడు మూడవ తండ్రి. భవభయాన్ని పోగొట్టేవాడు నాల్గవ తండ్రి (5). వీరంతా సమానులే. కానీ కరుణామయుడైన సద్గురువు ఒక్కడే నిజమైన జనకుడు (6). తన వీర్యాన్ని తల్లి గర్భంలో నిక్షిప్తం చేసి తల్లి గర్భం ద్వారా జన్మను ప్రసాదించేవాడు లౌకిక తండ్రి. కానీ సద్గురువు అలౌకిక తండ్రి (7). సద్గురువు వీర్యకణాన్ని ఉపయోగించడు. ఏ స్త్రీ గర్భాన్నీ ఆశ్రయించక పుత్రునికి జన్మనిచ్చి అతనిపై సంపూర్ణమైన అనుగ్రహాన్ని ప్రసరింపజేస్తాడు (8). జనన మరణాలనుండి విముక్తి కలిగించేవాడు, అత్యంత కరుణామయుడు, జ్ఞాన ప్రకాశకుడు, వేదాలలోని గుహ్యమైన సత్యజ్ఞానాన్ని బోధించేవాడు. సర్వ వ్యాపకుడూ అయిన గురుశ్రేష్ఠునికి నమస్కారము (9). అంధకారాన్ని తొలగించే జ్ఞానభాస్కరా! ఆత్మానుభవ సంత శేఖరా! భక్త చిత్త చకోర చంద్రా! కల్పతరువరా! మీకు నమస్కారములు (10).

గురుమహరాజ్ యొక్క మహిమను వర్ణిస్తుంటే నా వాక్కులోని అహంకారం కరిగిపోతుంది. అందువలన గురుచరణాలపై శిరస్సువంచి మూగవానివలె నిశ్శబ్దంగా కూర్చోవడమే ఉత్తమం (11). పూర్వ జన్మలో ఎంతో తపస్సు చేసి వుంటేనేగానీ త్రివిధ తాపాలను నశింపజేసే మహాత్ముని దర్శనం ఎవరికీ లభించదు (12). తమ శ్రేయస్సు కోసం పరమార్థాన్నీ, మోక్షాన్నీ సాధించాలని కోరుకునేవారు మహాత్ములకు సమర్పణ చేసుకోవాలి.

అటువంటి వారికి ఏ లోటూ వుండదు (13). మహాత్ముల సాంగత్యం యొక్క మహిమను ఏమని వర్ణించను? ఆ సన్నిధిలోనే సద్భక్తులకు వివేకము, వైరాగ్యము, పరమశాంతి లభిస్తాయి (14). శ్రీ సాయి మూర్తీభవించిన శుద్ధ చైతన్యము. ఆయన అవ్యక్తం నుండి వ్యక్తమయ్యారు. ఆయన యొక్క నిర్విషయస్థితిని గురించి వర్ణించడం ఎవరికి సాధ్యం? (15).

భావార్థులైన, ప్రియులైనవారు అయిన శ్రోతలపట్ల కరుణతో, ప్రేమతో శ్రీ సాయినాధులు తమ చరిత్రను తామే రసభరితంగా మధురవంతంగా తెలియజేసారు. ఇది చరిత్ర కాదు. భక్తులకు పవిత్రమందిరం (అనగా ఈ చరిత్ర గ్రంధమనే మందిరంలో వారే నివసిస్తారు) (16). ఆయన పవిత్ర హస్తంతో మన శిరస్సును స్పృశిస్తే చాలు మనలోని అహంకారం నశిస్తుంది. మనస్సు 'సో హం' భావంలో నిలుస్తుంది. దృశ్య జగత్తు అంతా ఆనందమయంగా భాసిస్తుంది (17). నావంటి పామరునికి ఆయన కీర్తి వర్ణించడానికి శక్తి ఎక్కడిది? అందుకే తమ భక్తులపైగల ప్రేమ కారణంగా వారే స్వయంగా తమ చరిత్రను నా చేత వ్రాయించారు (18). శ్రీ సాయిబాబా సహజంగా, సరళంగా మాట్లాడుతారు. వారి మాటలు నీతి, ధర్మము నిండివుండేవి. ఆయన శాంతి అనే భూషణాన్ని సదా ధరించివుంటారు. శ్రేష్ఠులైన సత్పురుషులు ఆయనను సదా ధ్యానిస్తూ వుంటారు (19). శ్రీ సాయిబాబాను సూర్యునితో పోల్చడం సాధ్యంగాదు. ఎందుకంటే సూర్యుడు అస్తమిస్తాడు (20). ఆయనను చంద్రునితో పోల్చడం అంతకంటె సరిగాదు. కారణం చంద్రుడు వృద్ధిక్షయాలను కలిగివుంటాడు. కానీ సాయిబాబా సదా సర్వదా సంపూర్ణుడుగా వుంటారు (21). ఈ హేమాద్పంతు శ్రీ సాయినాథుని చరణాలకు వినమ్రుడు, నమస్కరిస్తున్నాడు. ఈ చరిత్రను ప్రేమతో, శ్రద్ధతో శ్రవణ చేయమని శ్రోతలకు విన్నవించుకుంటున్నాడు (22). భూమిని చక్కగా దున్నినప్పటికీ అందులో శ్రేష్ఠమైన విత్తనాలు వేసినప్పటికీ మేఘాలు వర్షించనిదే పంటలెలా పండుతాయి? (23) మహాత్ముల చరిత్రలు చెవి సోకగానే సర్వపాపాలూ నశించిపోతాయి. పుణ్యం అంకురిస్తుంది. ఈ చరిత్ర వినడమనే పండుగ యొక్క లాభాన్ని పొందండి (24). మనకు సాలోక్య, సామీప్యాలనే నాలుగు రకాల ముక్తులపై ఆసక్తి అవసరం లేదు. శ్రీ సాయిబాబాయందు నిశ్చలమైన భక్తి వుంటే చాలు. అందువలన మనకు శ్రేయస్సు చేకూరుతుంది (25). శ్రీ సాయిబాబా చరణాలను ఆశ్రయిస్తే అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. మనసు నిర్మలమవుతుంది (26). నీవు-నేను వేరనే బేధబుద్ధిలేని అట్టి సహజ స్థితిలో, అంచంచల భక్తిని ప్రసాదించమని శ్రీ సాయిబాబాను వేడుకొందాము (27).

ఇప్పుడు శ్రోతలకు నా మనవి ఏమనగా మీరు ఈ గ్రంథాన్ని చదివేటప్పుడు చదువవలసిన విషయము, చదవడము అనే క్రియ, చదివేవాడు ఈ మూడింటి ఏకాత్మతను కలిగివుండాలి. (28) ఈ హేమాద్పంతు ఈ సచ్చరిత్ర కర్తకాదు. భక్తుల శ్రేయస్సు కొరకు బాబా నియమించిన ఒక ఉపకరణము (పనిముట్టు) మాత్రమే (29). అదృష్టవశాత్తూ లభించిన ముత్యపు చిప్పను వదిలివేస్తే దానిలోని ముత్యాలు చేజారిపోతాయి. అశ్వద్ధ వృక్షం యొక్క ఉత్పత్తిన గూర్చి ఆలోచించనవసరం లేదు. (అంటే ఈ చరిత్ర వ్రాసే నా గురించిన ఆలోచన

అవసరం). మానవులు తమ శ్రేయస్సు విషయంలో ఉదాసీనతతో వుండడం శ్రేయస్కరం కాదు సుమా (30). ఇక్కడ ఈ లీలలను చెప్పించేవారు సాయిబాబా తప్ప మరెవ్వరూ లేరు. శ్రావ్యము, శ్రవణము, శ్రోత - ఈ మూడు ఏకమై పోవాలి (31). ఎక్కడైతే చెవులు వినడానికి సంసిద్ధంగా వుండవో, చిత్తం ఏకాగ్రత కలిగివుండదో అది పఠనమే గాదు. ఇక శబ్దాల అర్థాలను గ్రహించగలవారెవరు? (32). ఈ చరిత్రని శ్రవణం చేసేటప్పుడు నిరభిమానులై వుండాలి. అప్పుడే ఈ శ్రవణానికి సార్థకత. ఎప్పుడూ అద్వైత భావాన్ని నిలుపుకోవాలి (33). నీటిలోని తరంగాలు ఏవిధంగానైతే నీటిలో లయించిపోతాయో అదే విధంగా చరిత్ర పఠనం చేస్తే ఇంద్రియమనోవృత్తులన్నీ సాయిలో లీనమవుతాయి (34). అప్పుడే జిజ్ఞాసువులకు పరమార్ధ బోధ లభిస్తుంది. వినోద ప్రియులకు వినోదానందం కలుగుతుంది. కవితాకోవిదులకు కవితా రసాస్వాదనం లభిస్తుంది (35).

ఇంతకుముందు ఈ సచ్చరిత్రలోని 39వ అధ్యాయంలో శ్రీ సాయిబాబా ఒక భక్తునికి ఏ విధంగా ఉపదేశం చేసారో వివరించబడింది (36). ఆ భక్తుడే ఒక రోజు బాబా వద్ద కూర్చుని వున్నాడు. ఆ సమయంలో అతడు భగవద్గీతలోని నాలుగవ అధ్యాయాన్ని ప్రారంభం నుంచి పారాయణ చేస్తున్నాడు (37). ఒక ప్రక్క అతడు బాబా పాదాలను ఒత్తుతూ నోటితో నెమ్మదిగా భగవద్గీతలోని శ్లోకాలను నెమ్మదిగా వల్లిస్తున్నాడు. ముప్పయి మూడవ శ్లోకం పూర్తయి ముప్పయి నాలుగవ శ్లోకాన్ని పఠిస్తున్నాడు (38). ఏకాగ్ర మనస్సుతో, తన్మయత్వంతో తనలో తాను చెప్పుకుంటున్నాడు. కానీ వాటిలోని అంతరార్థం తెలియకపోతే ప్రయోజనమేమున్నది? (39). అతడా శ్లోకం ప్రారంభించగానే బాబాకు తమ భక్తుని అనుగ్రహించాలని, సన్మార్గంలో పెట్టాలనీ సంకల్పం కలిగింది (40). ఆ భక్తుని పేరు నానా. అప్పుడు అతనితో బాబా యిలా అన్నారు. “నానా! ఏమిటి మనస్సులో గొణుగుకుంటున్నావు? నోటితో స్పష్టంగా చెప్పవచ్చుకదా! (41) ఇందాకటి నుంచి చూస్తున్నాను. నెమ్మదిగా నీలో నీవే గొణుక్కుంటున్నావు. కానీ పైకి స్పష్టంగా వినిపించడం లేదు. అందులో అంతటి రహస్యం ఏముంది? (42). అప్పుడు నానా సాహెబ్ బాబాతో, “నేను భగవద్గీత పారాయణ చేసుకుంటున్నాను. ఇతరులకు ఇబ్బంది కలుగకూడదని నెమ్మదిగా చెప్పుకుంటున్నాను” అన్నాడు (43). అప్పుడు బాబా అన్నారు: “సరే! అది ఇతరుల సంగతి. కానీ నా కోసం నీవు స్పష్టంగా గట్టిగా చదువు. నీవు చదివేది నీకైనా సరిగా అర్థమవుతున్నదో లేదో నన్ను చూడనీ!” (44). అప్పుడు నానా బాబాకు నమస్కరించి, “తద్విద్ధి ప్రణిపాతేన” అన్న శ్లోకం పెద్దగా చదివి విన్పించాడు. అది విని బాబా సంతుష్టులయ్యారు (45). తర్వాత బాబా ఆ శ్లోకానికి అర్థం చెప్పమని అడిగారు అప్పుడు నానా పూర్వపు ఆచార్యుడు వివరించిన అర్థాన్ని చక్కగా చెప్పాడు. అది విని బాబా బాగుంది అన్నట్లు తల ఊపారు (46).

అప్పుడు నానాతో బాబా అన్నారు: “ఉపదేక్ష్యంతితే జ్ఞానం” అన్న మూడవ పాదాన్ని మననం చేసి చూడు.

అందులోని 'తే' అన్న అక్షరం తర్వాత అకారమైన అవగ్రహం గుర్తును చేర్చితే అర్థం మారుతుందేమో చూడు! (47, 48). శంకరాచార్యులు, జ్ఞానేశ్వర్, ఆనందగిరి, శ్రీధరస్వామి మొదలైనవారు చెప్పిన భాష్యం అందరూ గౌరవించదగినదే! కానీ అవగ్రహం వుండడం వల్ల వచ్చే విశేషార్థాన్ని మనం ఎందుకు స్వీకరించగూడదు?" (49, 50) కరుణామయుడైన సాయి ఈ విధంగా చెప్పి జాతక పక్షుల వంటి భక్తుల కోసం బోధ అనే అమృత వర్షాన్ని కురిపించారు. దానిని ఇదివరకే 'సాయిలీల' మాస పత్రికలో వివరించడమైనది (51). కానీ 'సాయిలీల' పత్రిక పాఠకులకు కొందరికి ఈ అర్థం సమంజసంగా అనిపించలేదు. కొందరికి సందేహం కలిగింది. ఇది ఆశ్చర్యకారకం అయింది (52). అటువంటి వారిని సమాధానపరచడానికి, 'అజ్ఞానం' అన్న పదాన్ని ప్రతిపాదించడాన్ని సమర్థించడానికి మరొకమారు చిన్న ప్రయత్నం చేస్తాను (53). 'బాబాకు సంస్కృత పరిజ్ఞానం ఎక్కడిది?' అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ మహాత్ములకు తెలియనిది ఏదీ వుండదు (54). 'ఏకేన జ్ఞాతేన సర్వహి విజ్ఞాతం భవతి' 'ఒక్క ఆత్మను తెలుసుకుంటే సర్వమూ తెలుస్తుంది' – అన్న శృతి వాక్యం శ్రీ సాయిబాబాకు చక్కగా వర్తిస్తుంది. అటువంటి అపరోక్ష జ్ఞానం సాయిది (55). సత్పురుషులు సర్వాన్నీ కరతలామలకంలా చూడగలరు ఎవరివల్లనైతే సూర్యుడు గూడ ప్రకాశిస్తాడో అటువంటి మహాత్ములకు తెలియనిదేమున్నది? (56). అటువంటి వారికి ఇంతటి జ్ఞానం వుండగా ఇక అజ్ఞానానికి తావు ఎక్కడిది? వారికి సకల విద్యలు అవగతమైవుంటాయి. ఇక సంస్కృత భాషా పరిజ్ఞానం వుండకపోవడానికి అవకాశం ఎక్కడుంది? (57). 'సాయిలీలా' పాఠకులు కొందరు నానా సాహెబ్ వాదం విశ్వసించదగినది కాదని, అజ్ఞానమనే పదాన్ని తెలిపే అవగ్రహగుర్తు అతని స్వకపోల కల్పితమేననీ అంటారు (58). నానా తనకున్న పాండిత్యాన్ని ప్రదర్శించుకోడానికి అజ్ఞానమనే పదాన్ని వ్యర్థంగా చేర్చాడనీ అంటారు (59). అవగ్రహమనే గుర్తుతో జ్ఞానం అన్న పదాన్ని అజ్ఞానం అని చేర్చి గీతకు విపరీతార్థాన్ని, వక్రభాష్యాన్నీ కల్పిస్తున్నాడనీ అంటారు (60).

కానీ నిశితంగా ఆలోచించినట్లయితే 'సాయిలీలా' మాస పత్రికలో 39వ అధ్యాయంలో ఎటువంటి విపరీతార్థమూ చెప్పబడలేదు (61). ఎవరు ఎలా అనుకున్నప్పటికీ నానా చెప్పినది ప్రామాణికమైనా, కాకపోయినా అతడు చెప్పినది అర్థం లేదని కానీ, వ్యర్థప్రేలాపన అనీ తీసివేయడానికి వీలులేదు (62). నానాపైన ద్వేషం పెట్టుకోకుండా, ఎటువంటి మనోవికారాలకులోనుగాకుండా పాఠకులు తమ దృష్టి దోషాన్ని తొలగించుకుంటే అంతా సవ్యంగా కనిపిస్తుంది (63). ఉత్తమోత్తమమైన 'సాయిలీలా' పత్రికలో ముప్పది తొమ్మిదవ అధ్యాయం చదవకుండా ఈ యాభైయవ (50) అధ్యాయం తేలికగా అర్థంగాదు (64). శ్రీకృష్ణుని ముఖతః వెలువడిన భగవద్గీతలోని జ్ఞానయజ్ఞానికి సంబంధించిన నాలుగవ అధ్యాయంలోని ముప్ఫై నాలుగవ శ్లోకంలో అజ్ఞానమనే విషయమై ఈ ప్రవచనం జరిగింది (65).

– సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



మే సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



స్వామి రాకకై వేచిచూస్తున్న అనేకులయిన యోగులు, మునీశ్వరులు స్వామిని చూసి పరమానందంతో స్వామి చుట్టూ చేరారు. కార్తవీర్యార్జునుడు చేతులు జోడించి కొంచెము దూరంగా నిలబడివున్నాడు. అతడు స్వామిని చూస్తూ, భయముతో వణకసాగాడు. స్వామి యింతవరకు తనను చూడలేదంటే కారణమేమిటి అని యోచిస్తూ అపరాధ భావనతో అతడు ఖిన్నుడై చూస్తుండిపోయాడు. స్వామి శిష్యుడైన శాంతతపుడు కార్తవీర్యుని పరిస్థితిని గమనించాడు. నెమ్మదిగా స్వామిని సమీపించి, నమస్కరించి యిలా అన్నాడు. “ఓ దేవా! పరమధార్మికుడు, మీ ప్రియభక్తుడు అయిన యీ కార్తవీర్యుడు మీ సన్నిధి చేరి, మీ చల్లని చూపు తనపై ప్రసరించనందుకు ఖిన్నుడై నిలబడివున్నాడు. మీతో మాట్లాడటానికి భయపడుతున్నాడు. అతనిని కరుణించి ప్రసన్నులుకండి. అతనిని దయచూడమని ప్రార్థిస్తున్నాను.” అన్నాడు. స్వామి కార్తవీర్యుని వైపు చూశారు. కనుల నుండి కరుణ జాలువారుతుండగా అతనితో యిలా అన్నారు. “నాయనా, కార్తవీర్యా! భయమెందుకు? దుఃఖమెందుకు? ఇక్కడకురా. నా దగ్గర కూర్చో. నీకు పరమశాంతి కలుగుతుంది.” స్వామి ఆదరణకు కరిగిపోయిన కార్తవీర్యుడు ఆనందంతో స్వామి వద్ద చేతులు జోడించి కూర్చున్నాడు. స్వామి కార్తవీర్యునితో ఎంతోప్రేమగా యిలా పలికారు – “వత్సా! నీకేమి కావాలో నిస్సంకోచంగా అడుగు. నువ్వునా పరమ భక్తుడవు. నీవు కోరినవల్లా ప్రసాదించ సిద్ధంగా వున్నాను. అలాకాక ఏమైనా ప్రశ్నింప దలచావా? ప్రశ్నించు నీ సందేహములన్నీ తీరుస్తాను. ఏమీ సందేహించకు. నీ మనసులోనున్న దానిని నిర్భయంగా తెలియజేయినాయనా! నా భక్తులకు దుర్లభమయినవేవీవుండవు. వారి కోర్కెలన్నీ సంతోషంగా తీరుస్తారు. చెప్పు, నీకేమి కావాలి?”

కార్తవీర్యుడు స్వామి ప్రేమకు కరగిపోయాడు. ఆనందంతో అతని కనులు చెమ్మగిల్లాయి. స్వామి పాదాలపై శిరసునుంచి నమస్కరించాడు. చేతులు జోడించి స్వామితో యిలా అన్నాడు. “ఓ దయామయా! దేవదేవా! మీ అనుగ్రహంతో సకల సౌఖ్యాలూ పొందాను. అష్టైశ్వర్యాలు అనుభవించాను. అఖండ సామ్రాజ్య అధిపతినై మహీమండలాన్ని ఏకచ్ఛత్రాధి పత్యంతో పాలించాను.

స్వామీ! మీరు ప్రసాదించిన అనంతమైన వరాలతో ఐహిక సుఖభోగములన్నీ అనుభవించాను. ఇప్పుడు నాకు

కావలసినదల్లా ఒకటే! అదే మీ పాదసన్నిధి. ఓ దత్తదేవా! భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి నిరంతర నీ పదస్మరణలో తరించే వరమీయండి. అంతేకాదు. స్వామీ! ఆధ్యాత్మపరమైన సందేహములతో సమమతమౌచున్నాను. ఆ సంశయములను తీర్చగోరుతున్నాను." అపుడు స్వామి అనుమతితో కార్తవీర్యుడు స్వామినిలా ప్రశ్నించాడు.

"స్వామీ! సత్ పదార్ధమయిన స్థూల జగత్తు, అసత్ పదార్ధమయిన సూక్ష్మజగత్తు, వీటికి మూలకారణమైన అవ్యక్తము, కార్యమయిన వ్యక్తము, యిలా సర్వము బ్రహ్మపదార్ధమయిన నీవే అని మునులు అంటారు. అదే విధముగా వేదాంతులు, శృతి వాక్యానుసారముగా సర్వము నీవే అని అంటారు. అద్వితీయము, అవ్యయము స్వప్రకాశము అయిన బ్రహ్మమునందు, అశాశ్వతము, మాయాజనితము, నశ్వరము అయిన విశ్వము కేవలము భ్రాంతి వలన తోచుచున్నది గానీ నిజానికి విశ్వమునకు ఉనికియే లేదు. త్రాడును చూచి పాము అనీ, శుక్తిని చూచి వెండి అని భ్రాంతిపడటంలేదా? అలాగే కేవలము మాయాజనితమయిన విశ్వమును లేనిదానిని వున్నట్లుగా భావించటం భ్రాంతి మాత్రమే అని వారంటారు. మరికొందరు, 'అదేమి మాట? లేనిది వున్నట్లు ఎలా కనిపిస్తుంది? ఏ విధమయిన బోధలతోను యీ విషయాన్ని సరిపెట్టలేము. ఈ జగత్తు ప్రవాహ రూపము. దీనికి ఆది, అంతము లేవు. దీని యొక్క అస్థిత్వము తెలిసికొనుటకు అద్వేత సాధనమే పరిష్కారము.' అని ద్వైతాన్ని ప్రతిపాదిస్తారు. అందుకు వీరు శృతులను ప్రామాణికముగా చూపుతారు.

ఇక ధర్మ మీమాంసకులు – ధర్మమే పరము, ప్రపంచము నిత్యము, సనాతనము అంటూ వారుకూడా శృతులను ప్రామాణికముగా చూపుతున్నారు. సాంఖ్యులు సృష్టికి ప్రధానము కారణమని అంటారు. పురుషుడు కేవలము నిమిత్తమాత్రుడుగా వుంటాడనీ నానాత్మలఊ భోక్తలుగా వుంటారని వారంటారు. యోగులు కూడా సాంఖ్యుల వలెనే ప్రతిపాదిస్తారు. ఇక వేదమార్గాన్ని అనుసరించే తార్కికులు ప్రపంచము నిత్యము అని అంటారు. నానారకములయిన విద్వాంసులు వీరి మాటనే బలపరుస్తారు. వేదార్ధ పోషకులు మాత్రము ప్రపంచము వున్నది గానీ అది క్షణికము మాత్రమే అని అంటారు. పోనీ, యీ క్షణిక వాదులను ప్రక్కన పెడితే, శృతులను ప్రమాణంగా అంగీకరించ వారందరూ కేవలము ఏదో ఒక మూలసూత్రాన్ని నమ్మి అంతా ఒకే సిద్ధాంతానికి కట్టుబడి వుండకుండా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా. 'భగవంతుడు – సృష్టి' గూర్చి యిలా పలు విధాలుగా చెపుతారెందుకు? ఇటువంటి పరిస్థితిలో నావంటి ముముక్షువుల మనస్సులు సంక్షోభములో చిక్కుకుంటాయి కదా? ముముక్షువులు ఎవరిమాటను అంగీకరించాలి? ఎవరు చెప్పిన సిద్ధాంతమును అనుసరించాలి? ఎలా నడచుకొంటే మరలా భవబంధాలలో చిక్కుకొనకుండా ముముక్షువు రక్షింపబడతాడు?

ఓ దత్తాత్రేయ స్వామీ! మీరు సర్వశృతి సమన్వయముతో సత్యమును నిర్ధారించి మాకు తెలియజేయండి. మేము పరమపదమును పొందే మార్గాన్ని బోధించండి. అంతేకాక మాకు యింకను ఆచరణీయ యోగ్యములయిన విషయాలను తెలియజేయండి. స్వామీ! సర్వాచారములును తెలిసిన మీరు మాకు ఆచారములను గూర్చి కూడా బోధించండి.

ఓ దత్తదేవా! నాది మరొక్క సందేహము. బ్రహ్మ, ఈశ్వరుడు, ఇంద్రుడు, చంద్రుడు, వాయుదేవుడు, అగ్ని–యిలా

ప్రముఖులయిన దేవతలందరు భుక్తి ముక్తి ఫలప్రదాయివయిన నిన్నే ధ్యానిస్తూవుంటారు కదా? వారందరికీ గమ్యమునీవే, లక్ష్యసిద్ధి నీలో ఐక్యం కావటమే, అలాంటి నీవు కూడా ధ్యాననిష్ఠలో కూర్చుంటావే! సర్వము నీవే అయిన పరబ్రహ్మావు, నీకు కూడా ధ్యేయమనేది ఒకటి వున్నదా? ఆ ధ్యేయము ఏమిటి? ఈ నా సంశయము కూడా తీర్చవలసినదిగా ప్రార్థిస్తున్నాను. దేవదేవా! నీ అనుగ్రహంతో సప్తద్వీప విశాల భూమండలాన్ని ఏకచ్ఛత్రముగా పాలిస్తూవున్నాను. ఐహిక భోగములన్నింటినీ అనుభవించాను. ఇంక నాకేమీ వద్దు. నాకు ఆ చివరి పురుషార్థమయిన ముక్తి సాధనను అనుగ్రహించండి. నాకదే చాలు. కరుణా సముద్రా! నా సందేహములను సమాధానపరచి నన్ను దీవించండి. అంటూ స్వామి ముందు సాష్టాంగ పడ్డాడు కార్తవీర్యార్జునుడు.

స్వామి అతనిని లేవనెత్తి తన కరుణామయ దృష్టిని అతనిపై ప్రసరింపజేశారు. అతని కన్నులలోకి చూస్తూ "అర్జునా! నీ మనోగతాన్ని పూర్తిగా ఎరుగుదును. బిడ్డా! నా ప్రియ భక్తుడవైన నీపై నా అనుగ్రహం ఎల్లప్పుడూ వర్షిస్తూనే వుంటుంది! నీవు చేసిన స్తోత్రము వినలేదనీ, నీ ప్రార్థనలను నేను మన్నించలేదనీ అనుకొన్నావుకదూ! కానీ కుమారా! నాకు సర్వమూ తెలుసు. నా తత్త్వ రహస్యాన్ని బట్టబయలు చేస్తూ నీవు చేసిన ఆ స్తోత్రము నాకెంతో సంతోషాన్నిచ్చింది. ఆ స్తోత్రమును నీ నోట పలికించినది నేనే. నాకు అత్యంత ప్రీతికరమయిన ఆ స్తోత్రమును ప్రాతః సమయంలో ఎవరైతే భక్తిశ్రద్ధలతో పఠిస్తారో వారు యిహ, పర సౌఖ్యములనందుకొంటారు.

కుమారా! నీవు ముక్తిని కోరుకొంటున్నావు, నాకెంతో ప్రియాతి ప్రియమయిన నీవు కోరిన కోర్కెలు తీర్చటం నాకు ఆనందం. నన్ను నీ సహృదయంలో దాచుకొన్న ఘనుడవు. నీకు యీయరానిదేముంటుంది? నీ సకల అభీష్టములను తీర్చెడి నేను ముక్తిని ప్రసాదించకుండా వుంటానా? కానీ, అర్జునా! శాస్త్ర ప్రతిపాదనలు, ప్రమాణములను గూర్చి నీ మనస్సులో ఎన్నో సందేహాలున్నాయి. మహర్షులచే నిర్దేశించబడిన జీవన విధానములను గూర్చిన విజ్ఞానములను తెలియజెప్పేవే శాస్త్రములు. ఋషులచే ప్రతిపాదించబడిన శాసనములే శాస్త్రములు. దోషరహితములయిన యీ శాస్త్రములు నిస్సందేహముగా మానవాళికి శ్రేయస్సును చేకూర్చటానికి ఉద్దేశింపబడినవే. అటువంటి విజ్ఞానదాయకములయిన శాస్త్రములపట్ల నీకున్న అనుమానములు తొలగి పోకపోతే ముక్తి మార్గంపట్ల సరియైన అవగాహన కుదరటం అసంభవం. ఆ సందేహపూరితమయిన మనస్సులో జ్ఞానబోధ కూడా నిరర్థకమే అవుతుంది. కనుక నీ సందేహములను తొలగించటం చాలా అవసరం. అందువలన ముందుగా నీకు సప్తగాథల ఉదాహరణలద్వారా నీ అనుమానాలను తొలగిస్తాను. ఈ సప్త గాథలను పూర్వము బృహస్పతి ఇంద్రుడికి చెప్పాడు. వానిని యిపుడు నేను నీకు తెలియజేస్తాను. శ్రద్ధగావిను." అన్నారు.

సహ్యాద్రి పులకించింది. "నీకు యీయరానిదేమీ లేదు. నీవు నా ప్రియ భక్తుడివి". అంటూ స్వామి కార్తవీర్యార్జునుని పై కురిపించిన దివ్యానుగ్రహాన్ని కనులారాగాంచిన చుట్టూ వున్న భక్తగణం పరవశించిపోయారు. వారంతా స్వామి చెప్పబోయే సప్తగాథోదాహరణలను విని తరించేందుకై ఆనందంతో ఆతృతతో ఏకాగ్రచిత్తులై స్వామిపైనే తమ దృష్టి నిలిపి ఎదురుచూడసాగారు.

స్వామి యిలా చెప్పనారంభించారు -

ఒకానొక సమయంలో దేవగురువైన బృహస్పతి సురలకు, శత్రువులైన రాక్షసులు విమోహితులు కావాలనే వుద్దేశంతో కాబోలు, కామశాస్త్రము, దండనీతి శాస్త్రము, సంగీత శాస్త్రము, శిల్ప శాస్త్రము మొదలైన శాస్త్రములనన్నింటినీ ఎంతో ఆకర్షణీయంగా రచించి శిష్యులకు బోధింపసాగారు. ఆ బోధలను విన్న ఇంద్రుని మనస్సులో ఎన్నో సందేహాలు తలెత్తాయి. అయితే అతడు వానిని గురువుతో చెప్పటానికి సంకోచించాడు. కానీ ఆ అనుమానాలను ఎంతో కాలం దాచుకొనలేక ఒకనాడు గురు సమక్షమునకు వచ్చి, ఎంతో వినమ్రతతో చేతులు జోడించి నిలబడ్డాడు. అతడి వాలకమున, గమనించిన బృహస్పతి "ఇంద్రా! ఏదో కార్యార్థియై వచ్చినట్లున్నావు. విషయమేమిటో చెప్పరాదా?" అన్నాడు. "గురుదేవా! నా మనస్సులో కొన్ని సందేహములు తలెత్తాయి. వానిని మీతో మనవి చేసుకొందామని వచ్చాను. కానీ, నా మాటలు మీకు కోపాన్ని తెప్పిస్తాయేమోనని భయంగా వున్నది" అన్నాడు ఇంద్రుడు. బృహస్పతి నవ్వి, "నాయినా! భయమెందుకు? మనసులోని అనుమానాలను తీర్చుకొనటం ఎంతో అవసరం. శిష్యుని సందేహాలను తీర్చటం నా కర్తవ్యమే కదా? నిస్సందేహముగా నీ సందేహాలను తెలియజేయి", అనగానే ఇంద్రుడు గురువుకు నమస్కరించి, యిలా అన్నాడు - "గురుదేవా! తమరు ఆత్మ తత్త్వ విచక్షణులు. తత్త్వవేత్తలు. అటువంటి మీరు జ్ఞానతత్త్వమును బోధించాలి, కానీ తత్త్వబాహ్యములైన శాస్త్రములను బోధిస్తున్నారేమిటి? ఆ పని లౌకికులు చేయవలసినది కదా! అసలే ప్రాణులకు విషయ లోలత్వము పుట్టుకతోనే ప్రాప్తిస్తుంది. దానికి తోడు మీరు శాస్త్రములను రచించి మరీ బోధించటంవలన వారి పరిస్థితి మరింతగా లౌకిక విషయములపై వ్యామోహింపజేసి జ్ఞానమార్గానికి దూరముగా తీసుకువెళ్లే ప్రమాదం వున్నదికదా! మీరిలా చేయటం తగునా? ఇలా చేయటం చెడిన వారిని యింకా చెడగొట్టటమేకదా! గ్రుడ్డి వానిని కూములో పడద్రోసినట్లే కదా! ఇలా చేయటం వలన మీకు వచ్చే లాభమేమిటి? మీ చర్యలు నాకు అర్థం కావటంలేదు. గురుదేవా! మీవంటి జ్ఞానసంపన్నులు, మహా పండితులు యిటువంటి శాస్త్రముల జోలికి ఎంత మాత్రము పోకూడదని నా ఉద్దేశము. మరి తమరి అభిప్రాయమేమిటో నాకు తెలియపరచమని ప్రార్థిస్తున్నాను.

**- సశేషం**

చదవండి! **శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి** చదివించండి!!

సంస్కృత మూలము : శ్రీ వాసుదేవానంద సరస్వతి

తెలుగు : ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

వెల : రూ॥ 80-00 లు

ప్రతులు:- **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,**

c/o, **Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,

Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**

# వార్తాలాపము

మే సంచిక తరువాయి (సీరియల్)

ఓ రామా! ఈ ఏడుభూమికలను పొందిన మహాభాగుడు ఆత్మారాముడు. ఆ మహాత్ముడు పరమపదమును పొందును. పై ఏడుభూమికలయందును మొదటి మూడును సాధనకోటికి చెందినవి. మిగిలినవి నాలుగును సిద్ధావస్థకు సంబంధించినవి. ఈ నాలుగు భూమికలును జ్ఞానికి కలుగు విదేహముక్తియూ సమానమే. కాని జీవన్ముక్తునికి మాత్రము అంతకంతకు శరీరభాసము తగ్గిపోవును. పిదప ఉన్మత్తావస్థను పొందును. నాల్గవ భూమికవరకు ఉపదేశాది వ్యవహారములు పూర్తిగా ఆచరించగలడు. పంచమ భూమికయందు మాత్రము ఉన్మత్తావస్థను పొందును. ఒక్కొక్కప్పుడు అధికారియగు పురుషుని ఉత్తమప్రారబ్ధముచే శుక జడభరతాదులవలె ఉపదేశించిన ఉపదేశించవచ్చును కూడను. ఆరవభూమికయందు మాత్రము నడచుట, మట్లాడుట, చూచుట మొదలగు క్రియలు అన్నియు ఆగిపోవును. ఈస్థితియందలి ఒకమహాత్ముని కుంభకోణమునందు (మద్రాసురాష్ట్రమునందలి గ్రామము) చూచితిని. ఆయనకు మాట్లాడుట, నడచుట, చూచుట మొదలగుక్రియలు అన్నియు ఆగిపోయెను. నేత్రములు కూడ కదలుట లేదు. కదలెడివికావు. ఎవరైన వచ్చి రెండుమూడు చంచాలు కాఫీ కంఠములోపోసిన ఒకప్పుడు కంఠముదిగెడిది. మరియొకప్పుడు దిగెదికాదు. జనులు ఆయనకు ఒక ఆశ్రమమును నిర్మించిరి. కర్రలతో ఒక పడకకుర్చీని నిర్మించి అందు పరుండ బెట్టిరి. పూలమాలలు మొదలగునవి వేసి దేవునివలె ఆయనను పూజించి హారతులు ఇచ్చెడివారు. సంవత్ 1954 సం॥లో (అనగా క్రీస్తుశకము 1897వ సంవత్సరము నేను వారిదర్శనము చేసితిని. ఆ సమయమున అచ్చటి వృద్ధులు ఆయనను 38 సంవత్సరముల నుండి అదే విధముగ చూచుచున్నామని చెప్పిరి. అనంతరము ఐదారుసంవత్సరముల తరువాత ఆయన శరీరమును త్యజించెను. ఇది ఆరవభూమిక ఏడవ భూమిక యందు శరీరము 11 రోజులు మాత్రమే నిలచును అని మహాత్ముల నోట వింటిని.

ఇదంతయును శాస్త్రములయందు వ్రాయబడి ఉన్నది. అది చెప్పితిని. నేను ఇంకను మొదటి భూమికయందుకూడలేను. నోటితో మాత్రము బ్రహ్మమునుగురించి మాట్లాడుచున్నారు.

అనుభూతిం వినా మూఢో వృథా బ్రహ్మణి మోదతే ।
ప్రతిబిమ్బితశాఖాగ్ర ఫలాస్వదన మోదవత్ ॥

కొమ్మచివరనున్న పండ్లు నీటిలో ప్రతిబింబించినప్పుడు చూచి తినినంత సంతోషమును పొందునట్లు మూర్ఖులు అనుభవము లేనిదే పరబ్రహ్మమునందు ఆనందమును పొందితిమని చెప్పెదరు. అది వ్యర్థము. జలాశయము యొక్క తటమున కల వృక్షముల ఫలములు జలమున ప్రతిబింబించును. ఛాయను చూచి నీటిలోనున్న చేపలు వానిని తినుటకు పరుగిడును. వాని రుచియొక్క మిథ్యానుభవమును పొందును. అటులనే అజ్ఞానులు

శాస్త్రముద్వారానో, శ్రవణముద్వారానో, గురువుద్వారానో తెలిసికొనినంత మాత్రమున అనుభూతిని పొందకుండ "నేను బ్రహ్మమును, సాక్షిని" అని పలికి సంతోషించెదరు. అటులనే నేను కూడ బ్రహ్మశబ్దమును నోటితో పలికి సంతోషించు చున్నాను. ఈవిషయమున తుకారము తన అభంగునందు వ్రాసెను.

"ఇతరులకు బ్రహ్మజ్ఞానమును ఉపదేశించుచు, తాము అనుభవించక ఉండువారి ముఖముపై ఉమ్మివేయుచున్నాను. వారు వైఖరిని వ్యర్థముగా కష్టపెట్టుచున్నారు. కొందరు ద్రవ్యాదులు లభించును అను కోరికతో గ్రంథములను చదువుదురు. బ్రహ్మముపై బుద్ధినిపోనిచ్చెదరు. ఇదంతయు మోసము. అక్కడ పాండురంగడు శ్రీరంగము ఎక్కడ ? " శాంతి, క్షమ, దయ అను అలంకారములతో నీ శరీరమును, మనస్సును అలంకరించుము. నారాయణుని భజించుము. కామాది షట్శత్రువులను జయించుము. అంతట నీవే పరబ్రహ్మము అగుదువు. బ్రహ్మజ్ఞానపు మాటలు పలుకుటచే ఎవడును బ్రహ్మము అవలేడు. ఇనుపగుగ్గిళ్ళు నమలవలెను. అప్పుడే బ్రహ్మపదమున నృత్యము చేయగలడు. అబద్ధపు సాక్ష్యము చెప్పువాడు ధనలోభముచే అసలు సంగతి ఎరుగకయే సాక్ష్యము చెప్పును. అనుభవములేని వాడు చేయు బ్రహ్మనిరూపణమునకును, అబద్ధపుసాక్ష్యమునకును భేదము లేదు. ఈ బ్రహ్మజ్ఞానము నిజమని ఎవడు నిలువనంతవరకు శబ్దాదియుక్తులద్వారా ఎవడు ఎన్ని విధములు నీ ఎదుట బ్రహ్మజ్ఞానమును ప్రతిపాదించినను నీకు దానివలన బ్రహ్మానుభవము కలుగదు. ఆత్మానుభూతి లేనిదే పైపైన శబ్దజాలముతో కూడిన ప్రతిపాదన మిధ్యమాత్రమే. ఇట్లు చేసినదో శబ్దజ్ఞానమును సంపాదించుటకు చేసిన పరిశ్రమ విరామకాలమున ఎందుకును పనికిరాదు. "నేను బ్రహ్మము" అని నీవు జనుల ఎదుట పలుకుచు తిరుగుచున్నావు. కాని అంతఃకరణమునందు విషయసుఖమును అనుభవించవలెనను భావము బలముగా నున్నది. అది నీవు ఆలోచించితివా? ఓ మహానుభావా! నీవు దప్పిక గొనియున్నావు. పైగా అమృతము ఎంతయో తియ్యగా నుండును అని వర్ణించుచు ఇతరుల ఎదుట తిరుగుచున్నావు. నీయందలి తృష్ణాగ్ని జ్వలించుట శాంతించినప్పుడు నీవు నిరంతరము కేవలబ్రహ్మ స్వరూపుడవు అను జ్ఞానము నీకు కలుగును." ప్రకాశానందస్వామి వారిసంగతి వేరు. కాని మనమందరము అట్టి బ్రహ్మజ్ఞానులమే.

## ఇరువది మూడవ ప్రసంగము

ఛందూభాయి, శాస్త్రీజీ! రేవాశంకరభాయీ! ఇరువురు గోందలు, రాజకోట మొదలగుచోట్లకు వెళ్లిపోయిరి. స్వామి శ్రీ ప్రకాశానందులవారు పీరడియాలోనే ఉండిరి. ఆ రాత్రి స్వామి శ్రీ నిత్యానందులవారు ప్రకాశానందులవారు, వైద్యరాజు మొదలగువారు కూర్చునియుండిరి. వైద్యరాజు ప్రశ్నించెను.

వైద్య :- "నేను చాలరోజులనుండి వేదాంతశ్రవణము చేయుచున్నాను. కాని జ్ఞానము కలుగుట లేదు. కారణమేమి?"

స్వా.ప్ర. :- (స్వా.ని. వారితో) తమరు దయయుంచి సెలవివ్వండి. నేనుకూడ తమ శ్రీముఖము నుండి వినగోరుచున్నాను.

## వాసనా భేదములు : శుద్ధవాసన, మలినవాసన

స్వా.ని. :- "న శ్రవణమాత్రాత్ తత్సిద్ధిరనాదివాసనాయా బలవత్త్వాత్ ।"

"వాసన అనాదికాలమునుండి బలవత్తరముగానుండుటచే శ్రవణ మాత్రమున జ్ఞానము సిద్ధించదు" అని సాంఖ్య సూత్రములు చెప్పు చున్నవి.

వాసనాలక్షణమును వసిష్ఠులు చెప్పిరి.

"దృఢభావనయా త్యక్తపూర్వాపరవిచారనమ్ ।
యదాదానం పదార్థస్య వాసనా సా ప్రకీర్తితా ॥"

"ధృఢభావముతో పూర్వాపరములను విచారించకుండ పదార్థములను గ్రహించుట వాసన."

వాసన రెండు రకములు :- 1. మలిన వాసన, 2. శుద్ధ వాసన,

మలినవాసనను వశిష్ఠులు ఇట్లు వర్ణించిరి.

అజ్ఞానసుఘనాకారా ఘనాహంకారశాలినీ ।
పునర్జన్మకరీ ప్రోక్తా మలినా వాసనా బుధైః ॥

"బ్రహ్మస్వరూపమును ఆవరించు అజ్ఞానముతో దట్టమైన ఆకారము కలదియును, ఘనమగు అహంకారముతో నిండినదియును అగు వాసనను మలినవాసన అనెదరు. ఈ మలినవాసన ద్వారా మనుష్యునకు పునర్జన్మ కలుగును."

## మలినవాసనా భేదములు

జన్మనిచ్చు వాసనాభేదములు అనంతములు. అయినను శాస్త్రములలోని మలినవాసన మూడు రకములు. 1. లోకమవాసన, 2. శాస్త్రవాసన, 3. దేహవాసన.

ఈ మూడు వాసనలలోను ఏ ఒక్క వాసన ఉన్నను ఆ వాసన ప్రతిబంధకారణముచే యథార్థమగు ఆత్మజ్ఞానము కలుగదు.

## లోకవాసన

"జనులందరు నన్ను స్తుతించు పనులనే నేను చేయవలెను, వారినిందను పొందరాదు." అను పట్టుదలను కలిగియుండుట లోకవాసన. ఈ లోకవాసనను నూరుజన్మము లెత్తినను పూర్తి చేసి కొనలేము. కావున ఇతరుల నిందాస్తుతులను లెక్కపెట్టకుండ అధికారియగు నరుడు సమభావమును పొందియుండి తన హితమును కోరవలెను. ఈ విషయమున ఈ దృష్టాంతము చెప్పదగినది.

వార్తాలాపము

ఒక గ్రామమున ఒక వ్యాపారి యుండెను. అతడు పప్పుదినుసులు అమ్మెడివాడు. వడ్డీవ్యాపారము కూడ కలదు. జనులందరు అతనిని భక్తుడు అని పిలచెడివారు. ఈ భక్తుడు చాలా నమ్మకమైనవాడు. అతని వద్దనే అందరును తమకు కావలసిన సామానులన్నియు తీసికొనెడివారు. ఆతని వ్యాపారము చాల మిక్కుటముగా సాగెడిది. ఆ గ్రామమునందలి ఒకానొకవ్యక్తి వ్యాపారముచేయుటకు ఇతర దేశములకు వెళ్ళెను. భర్తలేని రోజులలో భార్య ఈ భక్తుని దుకాణము మీదనే సరకులు అన్నియును తీసికొనెడిది. కొన్ని రోజులతరువాత అతడు ఇతర దేశమునుండి తాను సంపాదించిన ద్రవ్యముతో ఇంటికి వచ్చెను. అతడు తనతో ఒక వేయి కాసులు కూడా తీసికొని వచ్చి యుండెను. వాని నాణ్యమును విలువకట్టించుటకు అతడు మన భక్తుని వద్దకు తీసికొని వచ్చెను. భక్తుడు లెక్కపెట్టి అందులో రెండు కాసులు తక్కువ అని చెప్పెను.

పరదేశము నుండి వచ్చిన వ్యక్తి పలికెను. నేను వెయ్యి కాసులు తెచ్చితిని. తక్కువ ఎట్లుండును? ఇట్లని అతడు కోపముతో భక్తుని డబ్బుపెట్టెను లాగి చొక్కా వెతికెను. అపెట్టెలో రెండు కాసులు ఉండెను. అతట అతడు బిగ్గరగా అరచి చెప్పసాగెను. "దొంగ, దొంగ." అతడు అందరిని ప్రోగుచేసి ఆలోచించకుండ ఆభక్తుని తిట్టుచు ఇట్లు చెప్పసాగెను. "చూడండయ్యా! భక్తాగ్రేసరుడట! భక్తులంటే ఇల్లాగ ఉండవలెను." గ్రామమంతా తెలిసిపోయెను. ఇంతలో ఈ వార్త పరదేశమునుండి వచ్చినవాని భార్యకు తెలిసెను. ఆమె ఒక నౌకరుద్వారా ఇట్లు కబురుపంపెను. "ఆ భక్తుడు దొంగకాడు. మీరు లేనప్పుడు ఇంటికి కావలసిన సామానులన్నియు మేము అతనివద్ద తీసికొంటిమి. వారికి డబ్బు ఇవ్వలసియుండెను. కావున మీరు తెచ్చిన వెయ్యికాసులలోనుండి రెండు కాసులు అతనికి ఇచ్చితిమి. ఇది వినినతోడనే అతనికి చాల పశ్చాత్తాపము కలిగెను. అతడు భక్తుని క్షమించమని ప్రార్థించెను. అంతవరకు తిట్టుచున్న ఇతరులుకూడ భక్తుని స్తుతించసాగిరి. భక్తుడు భక్తుడే అనిరి.

జనులు ఇటులనే ఆలోచించకుండ మాట్లాడెదరు. వెనుముందులు చూడకుండ నిందించెదరు. భక్తుడు దుకాణమునుండి క్రిందికి దిగి చేతులలోనికి దుమ్ముతీసికొని ఇట్లు పలికెను. "నన్ను పొగడినవారి తలపై ఈ దుమ్ము పోయుచున్నాను. నన్ను నిందిచినవారి తలపై ఈ దుమ్ము పోయుచున్నాను."

శాస్త్రములు కూడ చెప్పుచున్నవి.

విద్యతే న ఖలు కశ్చిదుపాయః సర్వలోక (పరి) తోషకరో యః ।

సర్వథా స్వహితమాచరణీయం కిం కరిష్యతి జనో బహుజల్పః ॥

"పూజలందరిచేతను స్తుతిని పొందు ఉపాయము ఈలోకమునందలి ఏ శాస్త్రమునందు లేదు. అధికారియగువాడు లోకసునను త్యజించి, సర్వవిధముల తనకు హితముకలుగునట్లు సంచరించవలెను. జనుల నిందాస్తుతులయందు శ్రద్ధను చూపరాదు. ఈ లోకులు చేయు నిందాస్తుతులచే లాభనష్టములు కలుగవు."

- సశేషం

---

# సాయిబాబాతో ఇంటర్వ్యూ

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

శ్రీ సాయిని ఎందరో ఎన్నోసార్లు పేరు, ఊరు అడిగారు ఆయనెన్నడూ ఏమి చెప్పక చిరునవ్వుతో దాటేసేవారు. ఒకప్పుడు ధూలియా కోర్టుకు రావించబడ్డ ఒక దొంగ, విచారణ సమయంలో తన దగ్గర పట్టుబడ్డ వస్తువులు తాను దొంగిలించినవి కావని, తనకు షిరిడీలో నివసించే సాయిబాబా యిచ్చారనీ చెప్పాడు! దాని మీదట శ్రీసాయిబాబాను కోర్టుకు హాజరుకమ్మని సమన్ జారీ చేశారు కోర్టువారు, బాబా ఎందరికో పూజ్యులవటం వల్ల ఆయనవద్దకే కోర్టుప్రతినిధి ఒకరొచ్చి శిరిడీయందే ఆయనను విచారించవలసిందిగా భక్తులు పెట్టుకున్న అర్జీననుసరించి కోర్టు నుండి ఒక న్యాయవాది వచ్చి బాబాను ప్రశ్నించి, ఆయన చెప్పిన సమాధానాలు వ్రాసికెళ్ళారు. ఆ ప్రశ్నోత్తరాలివి :-

న్యాయవాది : "మీ పేరేమి?"

బాబా : "వీరంతా సాయిబాబా అంటారు."

"మీ తండ్రి పేరో?"

"అదీ సాయిబాబాయే!"

"మీ గురువుగారి పేరు?"

"వెంకూసా"

"మతము"

"కబీరు!"

"కులము?"

"దైవము!"

"వయస్సు"

"లక్షల సంవత్సరాలు"

"సరిగ్గా చెప్పండి?"

"నేనెన్నడూ అబద్ధం చెప్పను!"

---


చదవండి! **భగవాన్ శ్రీ భరద్వాజ** చదివించండి!!

**రచన: శ్రీమతి శ్రీదేవి**

వెల : రూ॥ 125-00 లు

ప్రతులు:- **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,**

c/o, **Sri Manga Bharadwaja Trust,**

Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,

Jaipuri Colony, Nagole, Hyderabad - 68

Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**

# శ్రీ భరద్వాజ ప్రేమామృతము



OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A.P.)

Date 2-6

# శ్రీ భరద్వాజ లేఖామృతము

**E. Bharadwaja,** M.A.
DWARAKAMAYI
P.O., VIDYANAGAR - 524413
Nellore Dt. (A.P.)

Date: 2/6

చి॥ అనసూయకు,

ఆశీస్సులు. క్షేమం. నీవు పరీక్షలు బాగానే వ్రాశావనుకుంటాను. spot evaluation నుండి నేను నిన్ననే వచ్చాను. valuation బాగా liberalగా వుంది. Mahesh Yogi సంస్థ వారు ఆడవాళ్ళకు training ఆరంభించనున్నారు. దాని application పంపుతున్నాను. Fillup చేసి వెంటనే పంపు. Qualification Degree అని వ్రాసారు గాని కాకున్నా తీసుకుంటున్నారు. గత 2,3 నెలలుగా నీవు T.M చేస్తున్నావనీ, D.Sulochana వద్ద initiation తీసుకున్నావనీ, ఆసనాలు, సుఖప్రాణాయామము చేస్తున్నావనీ వ్రాయి. తండ్రిలేరనీ, కుటుంబంలో సాంప్రదాయంగా తీవ్ర ఆధ్యాత్మిక చింతనున్నదనీ గత 3,4 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సాహిత్యం చదువుతూ, సద్గ్రంథాలు చదువుతూ పుజాదులు చేస్తున్నావనీ, కొందరు మహనీయులను దర్శించాననీ వ్రాయి. ఇవన్నీ covering letter గా వ్రాసి type చేసి applicationతో పాటు పంపు. తేది అయిపోయిందని బాధపడనక్కర్లేదు. Hindi Teacher గారు పిల్లలు interested అయితే ఈ application ను type కాపీ తీసి, ఇల్లాటి covering Letter వ్రాసి, పైన advance అని వ్రాసి, covering letter లో మీరున్నది మారుమూల ప్రాంతం కావడంవల్ల మీకిప్పుడే ఈ విషయం తెలిసిందిగనుక ఆలస్యంకాకుండా advanceగా పంపుతున్నారనీ, అసలైన form మీదనే కావాలంటే పంపుతామనీ వ్రాస్తూ ఆ ఫారం పంపమని కోరమని వాళ్ళకు చెప్పు.

మంగక్క కులాసా. అయితే చెయ్యి నొప్పిగా ఉండటంవలన జాబు వ్రాయలేదని వ్రాయమన్నది. పాప బాగా ఆడకుంటూంది. చాలా కబుర్లు చెబుతోంది. పిచ్చి అల్లరి, విసిగించడం ఉండవు. సులోచన వాళ్ళు పాపను చూస్తూ మంగకు సహాయం చేస్తున్నారు. ఎట్టి ఇబ్బందీలేదు. ఈ విషయంలో మీరేమీ ఆందోళన పడనక్కర్లేదు. అమ్మగార్కి నమస్కారములు. మందిర విరాళాల కోసం మిగిలిన శెలవంతా tours వెళుతుంటాను. జులై 3 నుంచి కాలేజి. హైదరాబాద్‌లో మా నాన్నగారు క్షేమం. సత్యం వచ్చి వెడుతున్నాడు. అతను క్షేమమే. ఇంతకుకముందు శ్రీదేవి వ్రాసిన జాబు చేరినది. తనకూ సాధన బాగానే జరుగుతూందని తలుస్తాను. నీ సాధన పరీక్షలయ్యాక మళ్ళీ ఆరంభిస్తుంటావని తలుస్తాను. అన్నయ్య వదినలను అడిగినట్లు చెప్పండి. ఇంతకుముందు పనిపిల్లకని తెప్పించిన బట్టలకు పైకం M.O ద్వారా పంపుతున్నాను. మందిరనిర్మాణం పని ఒక వారంలో ఆరంభిస్తున్నాము. తీరికలేక వివరంగా, విడివిడిగా జాబులు వ్రాయడంలేదు. బాధ పడవద్దు. అమ్మగారి ఆరోగ్యం, ధ్యానం ఎలా వుంటున్నాయి? పరీక్షలెలావ్రాశావు? అన్నీ వ్రాయి.

ఇట్లు
ఆశీస్సులతో
భరద్వాజ.

MICIలో trainingకు వెళ్ళేప్పుడు 300/- లేక 350/- మోదట కట్టవలసివస్తుంది. కాని చాలా లాభం. సులోచన అనుభవం చూస్తున్నాం గదా! యావజ్జీవితం సాధన చేసుకొనే సదవకాశమిచ్చి జీతమిస్తారు! ఇంకేం కావాలి? వదలుకోవాలంటే వదలవచ్చు.

# మధ్యవర్తులా? మార్గదర్శులా?

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

గొప్ప మహాత్ముల పరిపూర్ణ సిద్ధ పురుషుల చరిత్రలు చదవటం ఆధ్యాత్మికతకు ఎంత అవసరమో మన రాష్ట్రానికి, ఇతర రాష్ట్రాలకు వున్న భేదంచూస్తే తెలుస్తుంది. ఇతర రాష్ట్రాలలో దైవాన్ని అర్చించటంతో పాటు భక్తులను పూజించడం, వారి చరిత్రలు పారాయణ చేయడం వున్నది. తమిళ దేశంలో శైవసిద్ధుల చరిత్ర 'పెరియ పురాణం' అన్న గ్రంథాన్ని పారాయణ ద్వారా భక్తులు స్మరిస్తారు. ఆధ్యాత్మిక పరిజ్ఞానమేమీ లేని బాలుడు - వెంకట్రామన్ - భగవాన్ శ్రీరమణ మహర్షిగా రూపొందడంలో పెరియ పురాణం వహించిన పాత్ర ఆయన చరిత్ర చదివితే తెలుస్తుంది. మహారాష్ట్రదేశంలో "శ్రీ గురు చరిత్ర" మొ॥న దత్తావతారాల చరిత్రలతోబాటు తుకారాం, జ్ఞానేశ్వర్, నామదేవ్ మొ॥ భక్తుల చరిత్రలుగల 'శ్రీపాండురంగ భక్తవిజయం' మొ॥ భాగవతులచరిత్రలు పారాయణ చేయడం యీ నాటికీ ఆచారం. ఉత్తర భారతదేశంలో రామకృష్ణాది మూర్తులనర్చించడంతోబాటు కబీరు, తులసీదాస్, మీరా మొదలైన భక్తులను ఆరాధించడం కూడ చూడవచ్చు. ఈ విధంగా భాగవతులనారాధించే సాంప్రదాయం ఆంధ్రప్రదేశంలోనే అంతగా కనిపించదు. అందుకే ఆధ్యాత్మికత మిగిలిన రాష్ట్రాలలోకంటే తక్కువగా కనిపిస్తుంది ఆంధ్రదేశంలో.

భక్తి, ఆధ్యాత్మికతకు మూల స్తంభాలు మూడు, - భగవంతుడు, భాగవతము, భాగవతుడు. పూర్ణ భగవత్తత్త్వం భక్తిజ్ఞానాలు పరిపూర్ణమయ్యాక గాని అనుభూతం కాదు. అలా మనం పరిపూర్ణత పొందేలోగా ఆ దైవం యొక్క ఆస్తిక్యత మనకు సంశయాస్పదంగా వుంటూ మనసు భక్తిలో నిలువక నిరుత్సాహానికి, అవిశ్వాసానికి దారితీస్తాయి. దైవం గురించి ఆయన తత్త్వాన్ని గురించి, ఆయనను పొందే మార్గాలగురించి, అలా పొందిన మహాత్ముల గురించి తెలిపేదే భాగవతము! ఈనాటి సాంఘిక పరిస్థితులదృష్ట్యా భాగవతాన్ని గూడా విశ్వాసంతో చదివి ఆచరించలేము. 'ఏమో! అదంతా కట్టుకథలేమో! ఆత్మవంచనేమో! అన్న సంశయం పొడసూపక మానదు. ఒకవేళ సందేహం కలుగక పోయినా కలిగించేవారికి తక్కువలేదు. ఈ పరిస్థితుల్లో భగవంతుడొక్కడే భక్తుల భక్తికి ఆధారం. భాగవతుడంటే భాగవతంలో చెప్పినదాన్ని ఆచరించి పరిపూర్ణుడై భగవదనుభూతిని పొందిన శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీరమణ మహర్షివంటివారు. వీరినుండి వ్యక్తమయ్యే భగద్విభూతి, మహాత్మ్యమే సామాన్య ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రాతిపదిక!

రాముడు, కృష్ణుడు, ఏసు, బుద్ధుడు మొ॥ వారంతా మానవ రూపంలోనే ఈ భూమిమీద సంచరించారన్న విషయం మరచి, వార్ని పూజించేవారూ. మహత్ములను ఆరాధించడాన్ని "మానవ మాత్రులను పూజించేదేమిటి?" "అయినా మనకు భగవంతునికి మధ్య మధ్యవర్తులెందుకు?" అని ఎద్దేవా చేయటం కేవలం అజ్ఞానం. భగవంతునికీ భక్తునికీ, మధ్య వర్తించే వారధి, వాహనము భాగవతుడు (గురువు). ఆయనే మార్గదర్శి, మార్గము - కొంచెం సూక్ష్మంగా పరికిస్తే - గమ్యం కూడా! తానే మార్గమని, తన ద్వారా తప్ప భగవంతుణ్ణి ఎవరూ చేరలేరని అన్న సద్గురు మూర్తి ఏసు వాక్యాలకర్థం యిదే!

---

# Donations List

## Annadanam List

| | | |
|---|---|---|
| 1. Pavan Kumar Patwari | Yenugonda | 1343.00 |
| 2. B. Sobha Rani | Yemminagar | 1539.00 |
| 3. Late Sri Jakka Suryanarayana | Hyderabad | 1400.00 |
| 4. M. Sobha Lakshmi | Hyderabad | 1343.00 |
| 5. M. L. Sudha Pradeepa | Hyderabad | 1343.00 |
| 6. Later Sri G.S.R. Krishna Prasad | Visakhapatnam | 1343.00 |
| 7. B. Seshagiri Rao | Visakhapatnam | 1343.00 |
| 8. B. Jeevaratnam Reddy | Tadipatri | 1345.00 |
| 9. Sri Raghavendra Rao | Chirala | 1500.00 |
| 10. G. Chiranjeevi | Ongole | 1343.00 |

## School List

| | | |
|---|---|---|
| 1. G. Brahmaiah | Chirala | 500.00 |
| 2. S. Yadaiah | Hyderabad | 1116.00 |

## General Donation

| | | |
|---|---|---|
| 1. G.R. Viswanath | Hyderabad | 8500.00 |
| 2. V. Krishna | Hyderabad | 1500.00 |
| 3. G. Seetamahalaxmi | Macherala | 505.00 |
| 4. Anitha | Hyderabad | 11000.00 |
| 5. Srinu | Visakhapatnam | 1000.00 |
| 6. D. Subramanyam | Bangalore | 2000.00 |
| 7. B. R. Rao | Visakhapatnam | 1116.00 |

జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు–పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఇకనుండి ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు.

D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

**Sri Manga Bharadwaja Trust**,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone :040-20063300

**పూజ్య శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులు యీ క్రింది చిరునామాలకు విరాళాలర్పించి తరించగలరు.**

**Magazine** మరియు **General Donations** ను **"Sri Manga Bharadwaja Trust"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Annadanam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Sai Master)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Ashramam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Peace Foundation)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల్వారా పంపగలరు

**Books order** ను **"Sri Manga Bharadwaja Trust (Publications)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

# నేటి కళా 'శాలలు' విద్యను నిరాకరించే సంస్థలే!

- ఆచార్య శ్రీ భరద్వాజ.

ఈనాడు మనదేశంలో ఎన్నో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు పాఠశాలలు వున్నాయి. కాని వాటి పరిస్థితి చూస్తున్న ఎవరైనా వాటిలో విద్య అన్నది పేరుకైనాలేదని తెలుసుకోగలరు. అవి నిజానికి విద్యను సామూహికంగా నిరాకరించే సంస్థలు. ఒకవంక ట్యూషన్ల ద్వారా మరింత ధనాన్నార్జించాలన్న పొట్టకూటి విద్యావంతులైన ఉపాధ్యాయులు అందుకోసం పాఠశాలలో వీలైనంత తక్కువ సమర్థంగా పాఠాలు చెబుతూ అవకాశమున్నంత వరకూ పాఠాలు చెప్పకుండా తరగతుల నుండి విద్యార్థులను పంపిస్తుంటే, మరొకవంక క్షణికము, నిష్ప్రయోజనమూ అయిన విడుదల, విరామం కోసమూ, దానిని సంతోషంగా ఆమోదించే విద్యార్థిలోకమూ కన్పిస్తున్నాయి. వారి బలహీనతలకు తావిచ్చి వారి విద్యానిరాకరణకు అవకాశం కల్పించేలా మార్కులు కలిపి ఉత్తీర్ణులను చేస్తున్నారు.

నిజానికిదెంతో ఆశ్చర్యకరమైన పరిస్థితి. తక్కిన జీవజాతులకూ మానవ జాతికీగల వ్యత్యాసమొక్కటే, తక్కిన ప్రాణులన్నీ నిత్యజీవిత నిర్వహణకు మించిన బుద్ధి శక్తిని కల్గియుండవు. కాని మనిషికి జిజ్ఞాస ప్రధాన లక్షణం. చుట్టూ ప్రకృతిని అర్థం చేసుకోజూస్తాడు. అందుకే కొద్ది శతాబ్దాలలో విశాలవిశ్వం గురించిన ఎన్నో అద్భుత సత్యాలను కనుగొని విజ్ఞాన శాస్త్రాలను మానవుడు రూపొందించుకోగల్గాడు. మానవత్వంలోని ప్రధానాంశమైన యీ జిజ్ఞాస మన పిల్లలలో కన్పిస్తుంది. పసిపిల్లలు కొత్తగా ఒక వస్తువు దొరికినప్పుడు, పరీక్షగా దానిని చూస్తారు. తర్వాత నోట్లో పెట్టుకొనిచూస్తారు. తర్వాత నేలకేసి కొట్టి చూస్తారు. ఇదంతా ఆ వస్తువు యొక్క తత్వాన్ని అర్థంచేసుకొనే యత్నమే. ఈ యత్నం క్రమపరిణామంలో కోతుల స్థాయిలో గూడ కన్పిస్తుంది. మన వస్తువులను ఎత్తుకెళ్ళిన కోతులు గూడ వాటినలాగే అర్థం చేసుకోచూస్తాయి. క్రమపరిణామంలో రూపొంది జాతిలక్షణంగా ఏర్పడిన జిజ్ఞాసను మనవిద్యా విధానం అంత సులభంగా నాశనం చేయగల్గిందంటే అదే చాలా గొప్పవిషయమే గాబోలు. ఒక విధమైన ప్రకృతి పైన అధిపత్యమే!

ఆరోగ్యవంతుడికి రుచికరమైన ఆహారం పట్ల సహజమైన ప్రీతి వుంటుంది. ఆకలిలేకున్నా రుచికోసం తిని ఆనందిస్తాడు. అలానే ఇతర ప్రాణికోటిలో జీవిత నిర్వహణకు కావలసినంత పరిజ్ఞానం మాత్రమే కన్పిస్తుంది. దీనిని మానవుడు కేవలం ఆకలికోసం తినే ఆహారంతో పోల్చవచ్చు. అదిగాక రుచులకోసం మనిషి తినడం చూస్తాము. దీనిని సహజమైన జిజ్ఞాసవలన తన ఉదర పోషణకు ప్రత్యక్షంగా పనికిరాకున్నా తెలుసుకోటం వలన కల్గే తృప్తికోసం ప్రకృతిని శోధించి విజ్ఞానాన్నార్జించడంతో పోల్చవచ్చు. నిజానికి ఆహారం విషయంలో గూడ యీ తేడా మనిషికి, జంతువులకూ ఉన్నట్టు కన్పిస్తుంది. ప్రాణులన్నీ ప్రకృతిలో సహజంగా లభించే ఆహారాన్ని తిని ఆకలి తీర్చుకొని తృప్తిపడతాయి. మనిషి మాత్రం తనకు రుచికోసం దానిని మలచుకొంటాడు. కొన్ని జంతువులు మనము రుచికరంగా వండుకొన్న వాటి మీద ప్రీతిని చూపవచ్చు. కాని తిరిగి అలాంటి రుచికరమైన ఆహారాన్ని రూపొందించుకొనేలా చేసేటంతగా వుండదు యీ ప్రీతి.

జిజ్ఞాస మానవత్వంలో యింత మౌలికమైనది. కాని తెనాలి రామకృష్ణుడు తన పిల్లి పాలుత్రాగకుండా చేసినట్లు, గుఱ్ఱం ఎండు గడ్డి తినేలా చేసినట్లు (యీ చరిత్రలు నిజమని నమ్మితే) మన విద్యావేత్తలుగూడ విద్యపట్ల విముఖతను మన జాతికి నేర్పగలిగారంటే అదీ గొప్ప చాతుర్యమే. జన్యువుల మరమ్మత్తు అవసరం లేకుండానే జాతి లక్షణాన్ని మార్చగలిగారు గదా? జ్వరంతో బాధపడేవాడు నోటి చేదువల్లనో, లేక వైద్యులిచ్చిన మందుల ప్రభావం వలన రుచి చచ్చి అహారాన్నిష్ట పడనట్టు మన జాతిని ఒక విధమైన మనో జాడ్యానికి గురిచేసి విద్య పట్ల యింతటి విముఖతను కల్గించారన్న మాట. అయితే యిలాంటి ప్రభావాన్ని కల్గించినమందులేవి? రోగాన్ని కల్గించిన క్రిములేవి? సినిమా, పత్రికలు, చెత్త సాహిత్యం అర్థం లేని టి.విలు, లక్ష్యమూ బాధ్యతలేని నాయకులు యివే ఆ మందులు, ఇలాటివాటిని ప్రోత్సహించి తమ స్వార్థానికి దేశాన్ని బలిచేసే బడావ్యాపారవేత్తలు, రాజకీయ పాలకులు-వారే క్రిములు, మరి దీనికి విరుగుడేమిటి?

**పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 50-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 15-00 |
| విజ్ఞాన వీచికలు | 50-00 |
| పరిప్రశ్న | 40-00 |
| మతమెందుకు? | 30-00 |
| ఏది నిజం? | 30-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 40-00 |
| బుద్ధధ్యాన హృదయం | 30-00 |
| దత్తావతార మహత్యం | 40-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 30-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 25-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 30-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 45-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 35-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 40-00 |

**ఇతర ప్రచురణలు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 40-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 40-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 70-00 |
| Supreme Master (Swami Samartha) | 60-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 60-00 |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, **Sri Manga Bharadwaja Trust,**
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**